
thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

ఏఐ వీడియోతో క్రికెట్ అభిమానుల్లో గందరగోళం



11

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 80 | జగిత్యాల | మంగళవారం | 16 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## డిమాండ్ ఉన్న వరికే ప్రాధాన్యం!

### విదేశాల్లో తెలంగాణ బియ్యానికి భారీ గిరాకీ

### 8 రకాల వంగడాల సాగుపై ప్రధానంగా దృష్టి

లాభసాటి పంటలు పండించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి సూచన



3

## బాలికపై దారుణం.. విపక్షాల మౌనం!



- ఖమ్మం మైనర్ ఘటనపై భగ్గుమన్న బీజేపీ
- నిమ్స్‌లో బాధిత బాలికకు పరామర్శ

ఖమ్మంలో మైనర్‌పై జరిగిన అఘాయిత్యం, హత్యాయత్నం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. నిందితుడికి రాజకీయ అండదండలు ఉండటం వల్లే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ దారుణంపై మౌనం వహిస్తున్నాయని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

3



### క్షేత్రస్థాయికి వెళ్లని అధికారులపై

# చర్యలు తప్పవు

- ప్రజాపాలన సమీక్షలో ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం
- పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమైన విభాగాలు..
- వెంటనే ప్రచారం కల్పించాలని సీఎం రేవంత్ ఆదేశం
- విద్యా, వైద్య రంగాల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరి..
- ప్రతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం

వివరాలు 2వ పేజీలో

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'తో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో తొమ్మిది రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన ఈ కార్యక్రమాలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో కొన్ని విభాగాలు తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆశించినంతగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాయని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం కేవలం పనులు చేయడం మాత్రమే కాదు, వాటిని ప్రజలకు సమర్థవంతంగా వివరించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉందని సీఎం స్పష్టం చేశారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు మీడియా మరియు డిజిటల్ మీడియా ద్వారా తగినంత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో వెల్లడైన సమస్యలను ఆయా శాఖలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

## మెట్రో కిషన్‌రెడ్డి మోకాలడ్డు

కేసీఆర్ కనుసన్నల్లోనే కేంద్రమంత్రి కుట్రలు

ప్రధాని రాజీనామా చేస్తే కేబినెట్‌ను రద్దు చేస్తా!

సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు



2

## రుచుల రాజధాని హైదరాబాద్

- ఇండియా టుడే అవార్డ్స్‌లో అరుదైన ఘనత
- నేషనల్ కలినరీ డెస్టినేషన్‌గా ఎంపిక
- కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు

2



## సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్రలు

### టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపణ

- ఓపెన్ కాస్ట్‌ల విస్తరణతో సంస్థ ఉనికికే ప్రమాదం..
- అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సింగరేణి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలిసి సంయుక్త పోరాటం

3





## పిల్లల పోషకాహారానికి సర్కారు పెద్దపీట

- 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకానికి శ్రీకారం
- రూ.800 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం పెంచడమే లక్ష్యం

2



## బీజేపీ ఆడిస్తున్న తోలుబొమ్మ!

- తెలంగాణను అవమానిస్తే చూస్తూ ఊరుకోం
- డైలాగులు చెప్పినంత సులువు కాదు రాజకీయం
- పవన్ కల్యాణ్‌పై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్

2

## సీజేపీ సభలో అనూహ్య ఘటన

అభిజిత్ దీప్కే చెంపపై కొట్టిన దుండగులు

దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు



4

## 19 నుంచి భారీ వర్షాలు

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

2





## కేరళలో నిఫా కలకలం


- కోజికోడ్ జిల్లాలో వ్యక్తికి నిఫా నిర్ధారణ
- మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స
- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

4

## ఇరాన్‌తో శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

4





# రుచుల రాజధాని మన హైదరాబాద్!

**ఇండియా టుడే టూరిజం అవార్డ్సులో అరుదైన ఘనత**

**అవార్డు స్వీకరించిన రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి**

**హైదరాబాద్:** తనదైన ప్రత్యేక వంటకాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరానికి మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండియా టుడే టూరిజం అవార్డ్సులో భాగంగా హైదరాబాద్ నగరం 'నేషనల్ కలినరీ డెస్టినేషన్' (ఉత్తమ పాకశాస్త్ర గమ్యస్థానం) అవార్డును సొంతం చేసుకుంది. గోవా వేదికగా సోమవారం జరిగిన టూరిజం సదస్సులో తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా పర్యాటక రంగంలో తెలంగాణ మరో ఘనతను సాధించింది. గోవాలో జరిగిన సదస్సులో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేషనల్ కలినరీ డెస్టినేషన్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఇండియా టుడే గ్రూప్ చైర్మన్ అరుణ్ పూరీ, ఎడిటోరియల్ డైరెక్టర్ రాజ్ చెంగప్ప, వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులు, నిపుణులు పాల్గొన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి కూడా ఈ సదస్సుకు హాజరయ్యారు. హైదరాబాద్‌కు లభించిన ఈ గౌరవం నగరానికి ఉన్న గొప్ప ఆహార వారసత్వానికి ప్రతీక అని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్, తెలంగాణ సంప్రదాయ వంటకాలు దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారసత్వ పర్యాటక కేంద్రాలు, ఎకో టూరిజం సర్క్యూట్లు, ఆధ్యాత్మిక, అడ్వెంచర్ టూరిజం గమ్యస్థానాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. తెలంగాణలో పర్యాటకుల రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వారసత్వ, ఎకో, వైద్య, ఆధ్యాత్మిక, కలినరీ పర్యాటక రంగాలపై పర్యాటకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోందని చెప్పారు. ప్రపంచంలోని ప్రముఖ ఆహార నగరాల జాబితాలో హైదరాబాద్ స్థానం దక్కించుకున్న నేపథ్యంలో ఈ అవార్డు నగర ఖ్యాతిని మరింత పెంచిందన్నారు. ఈ అవార్డును తెలంగాణ ప్రజలకు, పర్యాటక, ఆతిథ్య రంగాలకు చెందిన భాగస్వాములందరికీ అంకితం చేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు.

# బీజేపీ ఆడిస్తున్న తోలుబొమ్మ!

**తెలంగాణను అవమానిస్తే చూస్తూ ఊరుకోం**

**డైలాగులు చెప్పినంత సులువు కాదు రాజకీయం**

**కాంగ్రెస్‌పై విమర్శలు చేసేంత స్థాయి లేదు**

**పవన్ కల్యాణ్‌పై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్**



**హైదరాబాద్:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. బీజేపీ ఆడిస్తున్న తోలుబొమ్మ అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణను, కాంగ్రెస్ పార్టీని పదే పదే అవమానిస్తూ మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సినిమాలో డైలాగులు చెప్పినంత సులువు కాదు రాజకీయం అంటే అని హితవు పలికారు. పవన్ వ్యాఖ్యల వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని, బీజేపీ పెద్దలు రాసిచ్చిన స్క్రిప్టునే ఆయన చదువుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కల్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గతంలోనూ ప్రధాని మోడీతో పాటు బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తు చేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, ఆ ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కల్యాణ్ ఎక్కడున్నారు.. ఏ సినిమాలో నటిస్తున్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం అంటే సినిమాలో డైలాగులు చెప్పినంత సులభం కాదని, నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ ముందుగా చదువుకోవాలని ఆయన సూచించారు. ప్రధాని మోడీ ఇప్పుడు రాకెట్ల ముందు నిలబడి ఫొటోలు దిగుతున్నారంటే.. ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కల్యాణ్ అంత పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని మహేశ్ గౌడ్ గుర్తు చేశారు. ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయన్న విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై ముందు దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని, కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి ఆయనకు లేదన్నారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ రాజకీయ లబ్ధి కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని, పక్క రాష్ట్రం కూడా మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను పవన్ కల్యాణ్ ఇంతలా అవమానిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. వారి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కల్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని ఆయన ఆరోపించారు.

# 19 నుంచి భారీ వర్షాలు

**అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి**

**హైదరాబాద్, జూన్ 15:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణెళి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# క్షేత్రస్థాయికి వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

- ప్రజాపాలన సమీక్షలో సీఎం ఆగ్రహం
- పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమైన విభాగాలు..
- వెంటనే ప్రచారం కల్పించాలని ఆదేశం
- విద్యా, వైద్య రంగాల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరి..
- ప్రతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం



**హైదరాబాద్, జూన్ 15:** రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో తొమ్మిది రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన ఈ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో కొన్ని విభాగాలు తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆశించినంతగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం కేవలం పనులు చేయడం మాత్రమే కాదు, వాటిని ప్రజలకు సమర్థవంతంగా వివరించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉందని సీఎం స్పష్టం చేశారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు మీడియా మరియు డిజిటల్ మీడియా ద్వారా తగినంత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో వెల్లడైన సమస్యలను ఆయా శాఖలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, మరియు ఆస్తుల వివరాలన్నింటినీ నివేదికల్లో ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతి నెలా క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాల్సిందేనని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరాఖండిగా తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లకుండా కార్యాలయాలకే పరిమితమైన అధికారులు, జిల్లా కలెక్టర్ల వివరాలతో కూడిన పూర్తి నివేదికను తనకు సమర్పించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను, ఆదేశాలను పాటించని అధికారులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వెంటనే వివరణ కోరాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే వెంటనే ఆ జాబితాను సిద్ధం చేసి, అక్కడ కొత్త భవనాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా, వైద్య విభాగాల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం పాఠశాలల నుంచి కాలేజీల వరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ౠనజ) నుంచి ఉస్మానియా, గాంధీ వంటి పెద్ద ఆసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లోని ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రస్థాయి తరహాలోనే జిల్లాల వారీగా కూడా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్షలు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్షల కోసం రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి పంపాలని, వారు జిల్లా కలెక్టర్‌తో కలిసి 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ నిశితంగా సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయడంతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందుకున్న లబ్ధిదారుల వివరాలను సిద్ధం చేసి డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పురోగతిపై ఆరా తీస్తూ, నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి మోకాలడ్డు

- సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు
- కేసీఆర్ కనుసన్నల్లోనే కేంద్రమంత్రి కుట్రలు
- తెలంగాణపై కేంద్రానిది తీవ్ర వివక్ష
- రుణ బదలాయింపును అడ్డుకుని ఎల్అండ్‌టీని ఇబ్బందుల్లోకి నెట్టారంటూ ఆగ్రహం
- మోదీ హామీల అమలుపై చర్చకు సిద్ధమా?
- ప్రధాని రాజీనామా చేస్తే నా కేబినెట్‌ను రద్దు చేస్తా!




**హైదరాబాద్, జూన్ 15:** హైదరాబాద్ నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన మెట్రో రెండో దశ విస్తరణను బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా పదునైన విమర్శలు గుప్పించారు. మెట్రో విస్తరణ జరిగే ప్రాంతాల్లో బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని, కానీ నగర సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనకు సమయం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని, మెట్రో విస్తరణకు కేంద్రం నుండి నిధులు విడుదల చేయి-ంస్తారా లేదా అని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని, కేంద్ర ప్రభుత్వం రూపాయి ఇవ్వకపోయినా, భాగస్వామ్యం లేకపోయినా తామే మొత్తం భరించి నిర్మిస్తామని, కనీసం ఎన్‌వోసీ (చీూజ) అయినా ఇప్పించాలంటూ కేంద్ర పెద్దలను కోరినట్లు వెల్లడించారు. ఒకవేళ కిషన్ రెడ్డి చొరవ తీసుకుని నిధులు ఇప్పించి ఎన్‌వోసీ ఇప్పిస్తే తానే స్వయంగా శాలువా కప్పి సన్మానిస్తానని వ్యాఖ్యానించారు.

**కేసీఆర్ డైరెక్షన్‌లోనే కిషన్ రెడ్డి కుట్రలు**

గతంలో కేసీఆర్ తిట్టినట్లు తాను కిషన్ రెడ్డిని తిట్టడం లేదని, కానీ కేంద్రమంత్రి పూర్తిగా కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లోనే నడుస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు గాను కిషన్ రెడ్డి ఇప్పుడు మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటూ గురుదక్షిణ చెల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ కుట్రలు పన్నుతుంటే, కిషన్ రెడ్డి వాటిని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. అహ్మదాబాద్, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులకు నిధులు, అనుమతులు ఇస్తూ, హైదరాబాద్ మెట్రోకు మాత్రం ఎందుకు ఆపుతున్నారని, తెలంగాణపై కేంద్రానికి ఇంత వివక్ష ఎందుకని ప్రధాని నరేంద్ర మోదీ సూచనలను గుర్తు చేస్తూ ప్రశ్నించారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో వ్యయం కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల రూ.22 వేల కోట్లకు పెరిగిందని, పైగా ప్రజలు ప్రయాణించాల్సిన రూట్లలో కాకుండా వేరే చోట విస్తరించారని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎల్అండ్‌టీ సంస్థ విస్తరణకు ఒప్పుకోకపోవడంతో, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఐఆర్ఎఫ్‌సీ నుండి 4 శాతం వడ్డీకే రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయించిందని వివరించారు. అయితే రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తే తెలంగాణలో బీజేపీకి పుట్టగతులు ఉండవనే భయంతో, సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లతో చెప్పించి కిషన్ రెడ్డి ఆ రుణాన్ని ఎల్అండ్‌టీకి బదిలీ కాకుండా అడ్డుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌కు 2023లో ప్రకటించిన ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు కూడా కేంద్రం వద్దే ఆగిపోయిందని గుర్తు చేశారు.

**మోదీ హామీల లెక్క తేల్చండి..**

**నా రాజీనామాకు నేను సిద్ధం**

ఎన్నికల హామీల అమలుపై కిషన్ రెడ్డి విసిరిన రాజీనామా సవాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి అంతే బలంగా తిప్పికొట్టారు. 'ముందు మోదీ హామీల లెక్క తేల్చండి, ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. దేశ ప్రజలకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశాల నుండి నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇంతవరకు ఈ కీలక హామీలు నెరవేర్చకపోయినా కిషన్ రెడ్డి ఎందుకు ప్రశ్నించడం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేదనే నెపంతో ప్రధాని నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, అదే నిమిషంలో తాను కూడా తన పూర్తి కేబినెట్‌ను రద్దు చేసి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు.

# పిల్లల పోషకాహారానికి పెద్దపీట

**'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకానికి శ్రీకారం**

**రూ.800 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు**

**ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం పెంచడమే లక్ష్యం**

**హైదరాబాద్, జూన్ 15 :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకాన్ని సోమవారం ప్రారంభించింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఆయన, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వారానికి ఆరు రోజుల పాటు విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారంతో పాటు పాలు, రాగి జావా అందజేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు 'బడిబాట' కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షించేలా నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు కావాలనుకునే వారు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులపై ఆసక్తి చూపడం లేదని, ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల స్థాయిని పెంచి, ప్రతి తల్లిదండ్రి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనుకునే పరిస్థితిని తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు అధికారులు తెలిపారు.





# సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్రలు



- టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపణ
- ఓపెన్ కాస్ట్‌ల విస్తరణతో సంస్థ ఉనికికే ప్రమాదం..
- అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సింగరేణి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలిసి సంయుక్త పోరాటం..
- మంచిర్యాలలో 'బొగ్గుబాయిబాట' ప్రారంభం

**మంచిర్యాల, జూన్ 15:** లాభాల్లో నడుస్తున్న సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. కొత్త బొగ్గు బావులను సాధించుకుంటేనే ఇక్కడి యువతకు లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ (వారసత్వ) ఉద్యోగాల సాధన కోసం కార్మికులంతా రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాలో వారం రోజుల పాటు సాగనున్న 'బొగ్గుబాయిబాట' ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆమె, తొలిరోజు కాసిపేట మైన్-1ను సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మిక సోదరులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు అనుభవిస్తున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల సమావేశంలో కవిత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థను కాపాడాలనే నిజమైన చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంటే, వెంటనే సంస్థకు ప్రభుత్వం బకాయి ఉన్న రూ. 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను క్రమంగా రద్దు చేస్తూ, పర్యావరణానికి మరియు కార్మికులకు నష్టం చేసే ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను విచ్చలవిడిగా పెంచుతూ సింగరేణి ఉనికినే దెబ్బతీసే కుట్రలకు పాలకులు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

### సీఎం, డిప్యూటీ సీఎంలు కార్మికులను మభ్యపెడుతున్నారు

తెలంగాణలో సరికొత్త రాజకీయ శక్తిగా అవతరించిన తమ 'టీఆర్ఎస్' పార్టీకి సింగరేణి బిడ్డల ఆశీర్వాదం ఎల్లప్పుడూ అవసరమని కవిత పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాల విషయంలో సింగరేణి కార్మికులకు ఈ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. సింగరేణి సంస్థను, ఇక్కడి అండర్ గ్రౌండ్ మైన్లను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవడం కోసమే తమ టీఆర్ఎస్ పార్టీ, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కార్మిక సంఘంతో చేతులు కలిపి కలిసి పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తీసుకురావాల్సిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులే ఇక్కడికి వచ్చి అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ నాటకాలు ఆడుతున్నారని, కార్మిక రంగాన్ని పూర్తిగా మభ్యపెడుతున్నారని విమర్శించారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసికట్టుగా పనిచేశామని, తాను ఎక్కడున్నా అనునిత్యం కార్మికుల పక్షానే నిలబడి పోరాడానని గుర్తు చేశారు. గతంలో మెడికల్ బోర్డు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన ఘనమైన చరిత్ర మనదని, కానీ ఈ ప్రభుత్వ హయాంలో సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రోడ్డెక్కి పోరాడాల్సి రావడం అత్యంత ఆవేదనాకరమని అన్నారు. కార్మికుల ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డును నిర్వహించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత విమర్శించారు. ప్రస్తుతం సింగరేణిలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారని, కానీ వారి పిల్లల చదువుల కోసం ఇక్కడ సరైన పాఠశాలలు లేవని, వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని విభాగాలలో ప్రైవేట్ విధానాన్ని తీసుకొచ్చి పేద కార్మికులకు వైద్యాన్ని అత్యంత ఖరీదుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే కార్మికుల రక్షణ కోసం, వారి కుటుంబాల సంక్షేమం కోసం తమ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం' అనే ఐదు కీలక అంశాల అజెండాతో ముందుకు వచ్చిందని కవిత ఈ సందర్భంగా ప్రకటించారు. తమ పార్టీ భవిష్యత్తులో అధికారంలోకి వస్తే కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను, కార్పొరేట్ వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ స్థాయిలోనూ, జేబీసీసీ (జీదీజజ×) వేదికపైనా కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. నూతన పార్టీ స్థాపించిన తర్వాత సింగరేణి ప్రాంతంలో ఇదే తన మొదటి పర్యటన అని పేర్కొంటూ, సింగరేణి కార్మికుల దీవెనలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కవిత కాంక్షించారు.

# డిమాండ్ ఉన్న వరికే ప్రాధాన్యం!

- విదేశాల్లో తెలంగాణ బియ్యానికి భారీ గిరాకీ
- 8 రకాల వంగడాల సాగుపై ప్రధానంగా దృష్టి
- లాభసాటి పంటలు పండించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి సూచన
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో వ్యవసాయంపై కీలక నిర్ణయాలు
- గ్రామస్థాయిలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు



**హైదరాబాద్:** అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న 8 రకాల మేలు జాతి వరి వంగడాల సాగును రాష్ట్రంలో పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి భారీ ఆదరణ ఉందని, మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉన్నందున రైతులు లాభదాయకమైన పంటల వైపు మళ్లాలని సూచించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాభవన్‌లో సోమవారం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు ఎగుమతులకు అనుకూలమైన రకాల సాగుపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. ఆ 8 రకాల మేలు జాతి వంగడాలతో రైతులకు మంచి లాభాలు వస్తాయని వివరించారు. సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టి పెట్టాలని కోరారు. మార్కెట్లో గిరాకీ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించుకోవాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇస్తే రైతులకు నష్టాలు రాకుండా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

### గ్రామస్థాయిలో చైతన్య సదస్సులు..

రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో చైతన్య సదస్సులు నిర్వహించాలని భట్టి అధికారులను ఆదేశించారు. వానాకాలం సాగుపై ముందుగానే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్దేశించారు. రైతులకు లాభదాయకమైన వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కచ్చితమైన చర్యలు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై ఇకనుంచి నిరంతర సమీక్షలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# బాలికపై దారుణం.. విపక్షాల మౌనం!

- ఖమ్మం మైనర్ ఘటనపై భగ్గుమన్న బీజేపీ
- నిమ్స్‌లో బాధిత బాలికకు పరామర్శ




**హైదరాబాద్:** ఖమ్మంలో మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం, హత్యాయత్నం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. నిందితుడికి రాజకీయ అండదండలు ఉండటం వల్లే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ దారుణంపై మౌనం వహిస్తున్నాయని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే నిందితుడిని రక్షిస్తున్నారని ఆమె ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను బిజెపి బృందం పరామర్శించింది. బిజెపి ప్రతినిధి బృందంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, కోశాధికారి దేవకీ వాసుదేవరావు, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు ఉన్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేకల శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బాధితురాలి పరిస్థితి చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవనం పైనుంచి కిందకు తోసేయడంతో ఆ చిన్నారి ఎముకలు విరిగిపోయాయని, వెన్నెముక దెబ్బతిని కదలలేని స్థితిలో నరకం అనుభవిస్తోందని చెప్పారు. నిందితుడు గౌస్ కు ఇప్పటికే రౌడీషీటర్ అనే పేరుందని, గతంలో అనేక నేరాలకు పాల్పడ్డాడని శిల్పారెడ్డి ఆరోపించారు. అంతటి నేర చరిత్ర ఉన్న క్రిమినల్ పై ముందే చర్యలు తీసుకోకుండా పోలీసులు చోద్యం చూశారని మండిపడ్డారు. నిందితుడు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వాడనే ఆరోపణలు ఉన్నాయని, అందుకే మొన్నటి వరకు మహిళల రక్షణపై టీవీల్లో గొంతు చించుకున్న ఆ పార్టీ నేతలు ఇప్పుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. నిందితులు తమ పార్టీ వాళ్లు అయితే బీఆర్ఎస్ నోరు మూసుకుంటుందా అని ఆమె నిలదీశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని శిల్పారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మొత్తం 9 శాతం పోక్సో కేసులు నమోదైతే, కేవలం కాంగ్రెస్ పాలనలోని తెలంగాణలోనే 15 శాతం కేసులు నమోదవుతుండటం దారుణమన్నారు. 2025 నుంచి ఇప్పటివరకు 563 పోక్సో కేసులు రికార్డయ్యాయని గణాంకాలు వివరించారు. మంత్రి సీతక్క కేవలం ఆసుపత్రికి వచ్చి చూసి వెళ్లారే తప్ప కఠిన చర్యలపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. మైనార్టీ ఓట్లు, ఎంఐఎం మద్దతు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితుడికి వెంటనే కఠిన శిక్ష పడేలా చూడటంతో పాటు, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాధిత బాలిక కుటుంబానికి భారీ ఆర్థిక సాయం అందించాలని బిజెపి డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు.



# బాల్య వివాహం బతుకు ఆగం!

- నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వ పకడ్బందీ చర్యలు
- తరుణి స్వచ్ఛంద సంస్థతో కీలక ఒప్పందం
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రచారం
- అంగన్వాడీ, అధికారులకు ప్రత్యేక శిక్షణ
- మంత్రి సీతక్క సమక్షంలో అవగాహన ఒప్పందం

**హైదరాబాద్:** రాష్ట్రంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ, తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. 'బాల్య వివాహం - బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆమె వివరించారు. అంగన్వాడీ సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు బాల్య వివాహాల నిరోధంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామన్నారు. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని సీతక్క సూచించారు. ప్రతి బాలిక తన విద్యను పూర్తి చేసుకుని స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలంటే ముందుగా ఈ ముప్పుకు పూర్తిగా ముగింపు పలకాలన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కొత్త ఒప్పందం ద్వారా తెలంగాణలో బాల్య వివాహాల నివారణకు మరింత బలమైన వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు.

# ప్రాణాలు తీసిన రీల్స్ సరదా

- బాణమ్మ చెరువులో ముగ్గురు యువకుల గల్లంతు
- నీటిలో పడిన హెడ్‌ఫోన్స్ తీసే క్రమంలో విషాదం
- ఇద్దరి మృతదేహాల వెలికితీత
- మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు
- మేడ్చల్ జిల్లా కీసర పరిధిలో తీవ్ర విషాదం

**కీసర:** సోషల్ మీడియాలో లైకుల కోసం యువత చేస్తున్న సాహసాలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ఫోటోషూట్, వీడియోల కోసం వెళ్లి ముగ్గురు స్నేహితులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. నీటిలో పడిన హెడ్‌ఫోన్స్‌ను బయటకు తీసే క్రమంలో ఈ ఘోరం జరిగింది. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో జరిగిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. బొల్లారం ప్రాంతానికి చెందిన ఆంటోనీ (18), జోసెఫ్ (18), టోనీ (17) ప్రాణ స్నేహితులు. వీరు సరదాగా ఫోటోలు, వీడియోలు తీసుకునేందుకు ధర్మారం గ్రామంలోని బాణమ్మ చెరువు వద్దకు వెళ్లారు. చెరువు వద్ద ఇన్‌స్టాగ్రామ్ కోసం ప్రత్యేక ఫోటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తూ వారి హెడ్‌ఫోన్స్ నీటిలో పడిపోయాయి. వాటిని బయటకు తీసుకువచ్చేందుకు ఒకరి తర్వాత ఒకరు చెరువులోకి దిగిన ఆ ముగ్గురు యువకులు ఈత రాక నీటిలో గల్లంతయ్యారు. స్థానికుల సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సాయంతో ఇద్దరు యువకుల మృతదేహాలను వెలికితీశారు. నీటిలో మునిగిపోయిన మరో యువకుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సరదాగా బయటకు వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి విగతజీవులుగా మారడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టుల కోసం ప్రాణాలకు ముప్పు కలిగించే సాహసాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ జిల్లా పోలీసులు యువతను హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫోటోలు, సెల్ఫీలు తీసుకునేటప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.





# రాజకీయ చదరంగంలో ప్రాంతీయ పార్టీలు

## అస్తిత్వ పోరాటమా? ఆత్మసమర్పణమా?

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్‌ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు



**వాషింగ్టన్, జూన్ 15:** పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా–ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. 3నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసి పోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకత్రువంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్–రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా–ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్–అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్–అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిర శాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

# కేరళలో నిఫా వైరస్ కలకలం

- కోజికోడ్ జిల్లాలో వ్యక్తికి నిఫా నిర్ధారణ
- మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స
- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు




**తిరువనంతపురం, జూన్ 15:** దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్‌లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు.ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# సీజేపీ సభలో అనూహ్య ఘటన

## అభిజిత్ దీప్కేపై దాడి..

## చెంపపై కొట్టిన దుండగులు

## దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు



**జైపూర్, జూన్ 15:** నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్ జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ధర్నాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు అతడిని చెంపపై కొట్టారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీజేపీ కార్యకర్తలు దుండగులపై ఎదురు దాడి చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టొద్దని దీప్కే కోరినప్పటికీ సీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. దుండగులను చితకబాదారు. ఈ ఘటనతో ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అభిజిత్‌ను అక్కడి నుంచి తరలించారు. సీజేపీ చీఫ్‌పై దాడి జరిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిజిత్ దీప్కేపై దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తోన్న వారిపై భౌతిక దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్సీ వంటి ప్రధాన పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సీజేపీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే హాజరై ప్రసంగించారు. అనుహ్యాంగా ఈ ధర్నాలో ఆయనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు

# అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

## ప్రమాదంలో 12 మంది దుర్మరణం

**వాషింగ్టన్,జూన్15:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# సర్కారు బడుల్లో బడిబాట పండుగ వాతావరణం



**మల్కాజ్ గిరి, జూన్ 15చురకలు**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మల్కాజ్‌గిరి, కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాండ్ మేళాలు, పూలజల్లుతో ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థులు లక్ష్యంతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆల్వాల్‌లో జోనల్ కమిషనర్ విస్తృత పర్యటన

## వర్షపు నీటి నిల్వ ప్రాంతాల పరిశీలన.. సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



**ఆల్వాల్, జూన్ 15చురకలు**

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆల్వాల్ సర్కిల్ పరిధిలో రోడ్లపై వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, నాలాల ద్వారా వర్షపు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నీటిని మళ్లించే చర్యలపై ట్రాఫిక్ పోలీసులతో, నాలాలు–చెరువుల ఆక్రమణల అంశంపై హైడ్రా అధికారులతో చర్చించారు. తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు, డీవైఈఈ మహేశ్వర్, ఏఈలు అరుణ్, రావళి, హైడ్రా, ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చర్మవ్యాధుల చికిత్సకు నూతన పరికరాలు

**పెద్దపల్లి, జూన్ 15చురకలు.**

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చర్మవ్యాధుల చికిత్సకు అవసరమైన నూతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాల ద్వారా చర్మంపై ఏర్పడే పులిపిరులు, స్కిన్ ట్యాగ్‌లు తొలగించడంతో పాటు ఇతర చిన్న చర్మ సంబంధిత సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించనున్నారు. పెద్దపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ప్రత్యేక వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు.

# శ్రీసాయి పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా ఇక్కిరి కిష్టయ్య ఏకగ్రీవ ఎన్నిక



**ఆలేరు, జూన్ 15 (చురకలు):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో సోమవారం శ్రీ సాయి పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్లు నిమ్మల సారయ్య, ఇక్కిరి శ్రీహరి, మారుజోడు కుమార్, లింగాల మణెమ్మ, జలపు మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఇక్కిరి కిష్టయ్యను సంఘం చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఇక్కిరి కిష్టయ్య మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం, పాల ఉత్పత్తి పెంపుదల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎల్లప్పుడూ పాడి రైతులకు అండగా నిలిచి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇక్కిరి నరసింహులు, బండి సబిత, కళ్లేపు నరసింహులు, మారుజోడు చంద్రయ్య, జలపు సురేందర్, ఇక్కిరి సంపత్, బండి వంశీ, జూకంటి స్వామి, ఇక్కిరి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి మహాప్రభో...

## తలదాచుకునేందుకు నీడ లేదు!

**కామారెడ్డి, జూన్ 15చురకలు.**



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఇరుమ లక్ష్మి–రాజయ్యల జీవన పరిస్థితి ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. తలదాచుకునేందుకు కనీసం ఒక చిన్న ఇల్లు కూడా లేక, మూడు కర్రల మధ్య ప్లాస్టిక్ తాటిపత్రిని కట్టుకుని అందులోనే కాలం గడుపుతున్నారు. కడు పేదరికం, వృద్ధాప్యంతో వచ్చిన అనారోగ్య సమస్యలు ఒకవైపు వేధిస్తుండగా, మరోవైపు సొంత ఇల్లు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవనం సాగిస్తున్నారు. కూలి పనులు చేసే శక్తి లేకపోవడంతో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. పాఠశాలలో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనమే వారి ఆకలిని తీర్చుతోంది. వీరితో పాటు ఒక మనవరాలు కూడా ఉండగా, ఆమె బాధ్యత కూడా ఈ వృద్ధ దంపతులపైనే ఉంది. సొంతంగా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. "ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే వచ్చే నిధులతో ఎవరైనా దాతలు సహకరించి ఒక చిన్న గది అయినా నిర్మించి ఇస్తే ఈ తాటిపత్రి నరకం నుంచి బయటపడతాం" అంటూ లక్ష్మి–రాజయ్య దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వారి దయనీయ పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అలాగే దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# "ప్రతి చిన్నారి పాఠశాలలో చేరాలి"

- **జిల్లా విద్యాశాఖాధికారి పిలుపు**
- **శివాజీనగర్, పరిమళపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల సందర్శన–**
- **విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ – చేరికల పెంపుపై ప్రత్యేక దృష్టి**

**నారాయణపేట, జూన్ 15(చురకలు)**



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్యను అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.సోమవారం నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, శివాజీనగర్ మరియు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పరిమళపురం పాఠశాలలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్య పుస్తకాలు మరియు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యా సామగ్రి సకాలంలో అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, నమోదు వివరాలు, బోధన–అభ్యసన ప్రక్రియ, తరగతి గదుల నిర్వహణ, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను జిల్లా విద్యాశాఖాధికారి పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, అల్పాహార మరియు మధ్యాహ్న భోజన పథకాలు తదితర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి పాఠశాల వయస్సు గల పిల్లల వివరాలను సేకరించాలని, ఇంకా పాఠశాలలో చేరని బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల చేరికల పెంపు, నిలుపుదల విషయంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పరిమళపురంలో ఈ రోజు నమోదైన నూతన ప్రవేశాలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల చేరికల పెంపునకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఇదే ఉత్సాహంతో మరిన్ని ప్రవేశాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలరాం నాయక్,శంకర్, సురేందర్, ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జున మరియు శ్రీనివాస్ పాల్గొన్నారు."ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్యను అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత. విద్యార్థుల చేరిక పెంపు ద్వారా సమాన విద్యా అవకాశాలను ప్రతి చిన్నారికి చేరవేయగలం."

# 16.06 కోట్ల మొక్కలతో పచ్చని తెలంగాణకు శ్రీకారం

## 18న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వనమహోత్సవం–2026 ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 15చురకలు**

రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం–2026 కార్యక్రమం ఈ నెల 18న ఘనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్ సమీపంలోని గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ పార్కులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను టీజీఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, వేదిక, మొక్కల నాటే ప్రాంతాలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16.06 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని, పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో డీఎఫ్‌వో రోహిత్‌రెడ్డి (ఐఎఫ్‌ఎస్), ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, వనస్థలిపురం ఎస్‌హెచ్‌వో రవిబాబు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, నాయకులు మెరుగు రమేష్‌రెడ్డి, వినయ్ పటేల్, రణధీర్ తదితరులు హాజరయ్యారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సిద్దిపేట, జూన్ 15:చురకలు**

ఈ నెల 28, 29 తేదీలలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా నివారణకు ఫాగింగ్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అనుమానిత కేసులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అనంతరం పల్స్ పోలియో, డెంగ్యూ నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై మంగళవారం నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని సూచించారు.

# వాట్సాప్ కోచింగ్‌తో 62 మందికి అగ్నివీర్ ఉద్యోగాలు

## సైమ్స్ ఆధ్వర్యంలో అభినందన సభ

**ఆలేరు, జూన్ 15(సమయం న్యూస్):**

నిరుపేద విద్యార్థులకు వాట్సాప్ మాధ్యమం ద్వారా ఉచితంగా శిక్షణ అందిస్తూ సైన్యంలో ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తున్న సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ (సైమ్స్ ) ఆధ్వర్యంలో ఈ ఏడాది 62 మందికి పైగా అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని సంస్థ ఫౌండర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి ప్రసాద్ ముదిరాజ్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సోమవారం ఆలేరులో అభినందన సభ నిర్వహించి సన్మానించారు. వాట్సాప్ ద్వారా పీడీఎఫ్‌లు, గత ప్రశ్నాపత్రాలు అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో వ్యాయామ శిక్షణ, మోటివేషన్ తరగతులు నిర్వహించడం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు సాధింపజేసిన సైమ్స్ సేవలను ప్రభుత్వం గుర్తించి ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అరిగే లోకేష్ ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, మహేష్, రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మహేష్, జ్యోతి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలలే సమాజ నిర్మాణానికి పునాది: కలెక్టర్



**ఆదిలాబాద్, జూన్ 15(చురకలు)**

సమాజ నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు డిజిటల్ మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు భూమిపూజ నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చురకలు

మంగళవారం16 జూన్ 2026

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం-పాల పథకం ప్రారంభం





ఖైరతాబాద్, జూన్ 15 ( చురకలు).

: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యార్థుల అల్పాహారం-పాల పథకాన్ని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఖైరతాబాద్‌లోని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 29 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. విద్యార్థుల్లో ఆకలి, పోషకాహార లోపాలను తగ్గించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటమే లక్ష్యమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అల్పాహారం, పాల సరఫరా కోసం ప్రభుత్వం ఏటా రూ.720 కోట్లు వ్యయం చేయనుందని వెల్లడించారు. ఈ పథకం ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుందని, పాఠశాల హాజరు పెంపు, డ్రాప్‌అవుట్‌ల తగ్గింపు, విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభ మెరుగుదల లక్ష్యాలుగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలల్లో 93,501 మంది విద్యార్థులు చదువుతుండగా, తొలి దశలో 45 పాఠశాలల్లో 12,437 మంది విద్యార్థులకు ఈ పథకం అందుబాటులోకి రానుంది. mannatrust.org ఆధ్వర్యంలో కార్యక్రమం అమలు చేయబడుతోంది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, డీఈవో యాదయ్య, మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

### పాత పథకానికి కొత్త ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకివచ్చి 3 సంవత్సరాల తర్వాత పాఠశాల విద్యార్థులకు అల్ప హారం కార్యక్రమం ను ప్రారంభించడం జరిగింది. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభించిన పథకాన్ని కొనసాగించకుండా నిలుపుదల చేసి కొత్తగా ఈ ప్రభుత్వమే విద్యార్థుల కోసం అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం జరిగింది అంటే మూడు సంవత్సరాలు విద్యార్థులకు నష్టం జరిగినట్లే కదా ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహారం లో మెనూ మాత్రం ప్రకటించలేదు గత ప్రభుత్వంలో మెనూ ప్రకటించిన ప్రభుత్వం ఈ ప్రభుత్వంలో మేము కూడా ప్రకటించకుండా అల్పాహారం అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు అల్పాహారంలో పెద్ద ప్రభుత్వంలో కోడిగుడ్డు గత ప్రభుత్వంలో అమలు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించకుండా నిలుపు దల ప్రభుత్వం కనీసం ఆ పథకాలను కొత్త పేర్లతో ప్రకటించిన బాగుండేది కానీ ఆ పథకాలను గతంలో గతంలో గతంలో పథకాలను వారి ఖాతాలో చేరుతుందని భయంతో మూడు సంవత్సరాలు పాటు విద్యార్థులకు అల్పాహార పథకాన్ని కొనసాగిం చకుండా ఇప్పుడు అమలు చేయడం ఆస్పస్వదంగా ఉంది ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ కార్య క్రమాలను కొనసాగికి పేదలకు న్యాయం చేయాలని బీద ప్రజలు కోరుతున్నారు.

# యువతకు జాతీయ స్థాయి అవకాశాలు కల్పించే నేషనల్ టాలెంట్ హంట్

ఉట్నూర్, జూన్ 15చురకలు.




యువతలోని ప్రతిభను గుర్తించి జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ టాలెంట్ హంట్ కార్యక్రమ పోస్టర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కొమరం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలు, ప్రజా సమస్యలపై అవగాహన, పరిశోధనా దృక్పథం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన యువతకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని తెలిపారు. ప్రతిభావంతులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ టాలెంట్ హంట్‌లో స్పోక్స్‌పర్సన్, రీసెర్చర్, పబ్లిసిటీ కోఆర్డినేటర్ తదితర విభాగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేషనల్ టాలెంట్ హంట్ కోఆర్డినేటర్ భూపెల్లి శ్రీధర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి పంటల వైవిధ్యీకరణపై అవగాహన

హైదరాబాద్ జూన్ 15 ( సమయం)

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియా ద్వారాప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి వంటి సాంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులు, నీటి సంరక్షణ చర్యలు రైతులకు లాభదాయకంగా ఉంటాయని అధికారులు వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో పంటల వైవిధ్యీకరణే మార్గం ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు భరోస వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు అవలంబించాలి: వ్యవసాయ శాఖ రైతులను కోరింది.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

నారాయణపేట, జూన్,15(సమయం న్యూస్)



నారాయణపేట జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ "షీ" టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్లు నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మహిళలు, బాలికలు ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర ఏ విధమైన అన్యాయాలకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, కాలనీలు వంటి ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు గురైనప్పటికీ, ఉద్యోగ మహిళలు తమ కార్యాలయాల్లో వేధింపులకు గురైనప్పటికీ వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు మరియు బాలికలపై జరిగే వేధింపుల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు అవసరమైన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా "షీ" టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

మైనర్ బాలికలను వేధించడం, లైంగికంగా వేధించడం వంటి ఘటనల్లో సంబంధిత నిందితులపై పోక్సో చట్టం కింద కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయలేని మహిళలు, బాలికలు లేదా వారి కుటుంబ సభ్యులు "షీ" టీమ్ ఫోన్ నెంబర్ 8712670398 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు

# జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం

- **ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్**

వికారాబాద్, జూన్,15(చురకలు)



వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి వివరించగా, ఆమె ప్రతి ఫిర్యాదును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును విచారించి, చట్టపరమైన పరిధిలో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.వివిధ విషయాలపైన అందిన ఫిర్యాదులపైన బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని,ఎల్లప్పుడూ ప్రజల నుండి పోలీస్ అధికారులు ఫిర్యాదులు తీసుకొని, ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలిపారు.

# నోయిడా ఎయిర్ పోర్టులో విమానాల రాకపోకలు ప్రారంభం

ఢిల్లీ, జూన్ 15చురకలు.

నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. లక్నో నుంచి బయలుదేరిన తొలి విమానం నోయిడా ఎయిర్‌పోర్టులో దిగింది. ఈ విమానంలో జీవార్ ప్రాంతానికి చెందిన 170 మంది రైతులు, రైతు కూలీలు, మహిళలు ప్రయాణించారు. యమునా ఎక్స్‌ప్రెస్‌వే పక్కనే నిర్మితమైన ఈ ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలు, రోడ్డు కనెక్టివిటీతో ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌తో పాటు ఢిల్లీ ఎన్సీఆర్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరాఖండ్ ప్రాంతాల ప్రజలకు ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయోజనకరంగా మారనుంది..

# మంచిర్యాల ఎమ్మెల్యే గుండాగిరి మానుకోవాలి: కవిత

మంచిర్యాల, జూన్ 15:( చురకలు).



మంచిర్యాల ఎమ్మెల్యే గుండాగిరి మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బొగ్గుబాయి యాత్రలో భాగంగా మంచిర్యాలలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, నిర్లక్ష్యం కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతోందని ఆరోపించారు. కార్మికులపై వేధింపులు పెరిగాయని, ఉద్యోగాలు తగ్గించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల కేంద్రంగా తెలంగాణ రక్షణ సేన రాజకీయ కార్యకలాపాలను విస్తరిస్తామని, జిల్లా ప్రజల మద్దతుతో అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండా ఎగురవేస్తామని కవిత పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూన్ 15,( చురకలు)

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి G. కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి శుభాకాంక్షలు తెలిపారు. కిషన్ రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని, దేశాభివృద్ధిపై ఆయనకు ప్రత్యేకమైన అంకితభావం ఉందని ప్రధాని పేర్కొన్నారు. బొగ్గు, గనుల రంగాలను బలోపేతం చేయడంలో సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. కిషన్ రెడ్డి దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు..

# కిషన్ రెడ్డిపై సీఎం ఆరోపణలు.. మెట్రో విస్తరణకు కేంద్ర అడ్డంకులేనంటూ విమర్శ

హైదరాబాద్, జూన్ 15:( చురకలు)

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక అనుమతులు కేంద్ర మంత్రి G. Kishan Reddy కారణంగానే నిలిచిపోయాయని ముఖ్యమంత్రి A. Revanth Reddy ఆరోపించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, మెట్రో విస్తరణలో బీజేపీ ఎంపీలు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదన్నారు. జపాన్ ఆర్థిక సంస్థ నుంచి సమకూరిన రుణాన్ని ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియకు కూడా అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం భాగస్వామ్యం వహించకపోతే కనీసం ఎన్‌వోసీ ఇచ్చి తప్పుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యతతో ప్రాజెక్టును చేపడుతుందని సీఎం స్పష్టం చేశారు. జంట నగరాల అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యాల కోసం మెట్రో విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు.

# మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటు

## భారీ వర్షాల నేపథ్యంలో 24 గంటల అత్యవసర సేవలు

## సర్కిల్ వారీగా ఫీల్డ్ మార్షల్స్ నియామకం

మల్కాజ్‌గిరి, జూన్ 15:

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటల పాటు సేవలు అందించేందుకు సర్కిల్ వారీగా ఇన్‌చార్జి అధికారులను నియమించింది. వారి వివరాలు, సంప్రదింపు నంబర్లను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కార్పొరేషన్ పరిధిలో నియమించిన అధికారులకు "ఫీల్డ్ మార్షల్" హోదా కల్పించారు. ఘట్‌కేసర్ సర్కిల్‌కు అమర్‌నాథ్ రెడ్డిని ఫీల్డ్ మార్షల్‌గా నియమించగా, నాగారం, ఘట్‌కేసర్, పోచారం ప్రాంతాలను పర్యవేక్షించనున్నారు. ఉప్పల్ సర్కిల్‌కు ఎస్. భాస్కర్‌ను నియమించారు. చిల్కానగర్, బీరప్పగడ్డ, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట్‌రెడ్డి నగర్, ఉప్పల్ ప్రాంతాల బాధ్యతలను ఆయన నిర్వహిస్తారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మేడిపల్లి, పీర్జాదిగూడ, బోడుప్పల్, చెంగిచర్ల, బొగారం ప్రాంతాలకు ప్రవీణ్ కుమార్ ఫీల్డ్ మార్షల్‌గా వ్యవహరించనున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో వాంపుగూడ, కాప్రా, డాక్టర్ ఏఎస్ రావు నగర్, కుషాయిగూడ, చర్లపల్లి ప్రాంతాలకు వీరేంద్ర కుమార్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. నాచారం సర్కిల్ పరిధిలో శక్తిసాయినగర్, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం, హెచ్‌ఎంటీ నగర్ ప్రాంతాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు నియమించబడ్డారు. ఈ ఫీల్డ్ మార్షల్స్ పనితీరును డి. మోహన్‌రావు, ఏడీఎఫ్‌వో శ్రీధర్‌రెడ్డి, డీఎఫ్‌వో పర్యవేక్షించనున్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ వర్షాల వల్ల అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన ఫీల్డ్ మార్షల్‌ను వెంటనే సంప్రదించాలని అధికారులు సూచించారు.

## బీడీ, గని, సినీ కార్మికుల పిల్లలకు విద్యా ఉపకార వేతనాలు

**హైదరాబాద్, జూన్ 15చురకలు**

కేంద్ర కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 2026–27 విద్యా సంవత్సరానికి బీడీ, గని, సినీ కార్మికుల పిల్లలకు విద్యా ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదువుతున్న బీడీ కార్మికులు, సున్నపురాయి–డోలమైట్, ఇనుప ఖనిజం, మాంగనీస్, క్రోమ్ ఖనిజం, మైకా గని కార్మికులు మరియు సినీ కార్మికుల పిల్లలు అర్హులు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రీ–మెట్రిక్, ఇంటర్మీడియట్ నుంచి వృత్తి విద్యా డిగ్రీల వరకు పోస్ట్–మెట్రిక్ విద్యార్థులు జాతీయ ఉపకార వేతన పోర్టల్ (NSP) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రీ–మెట్రిక్ దరఖాస్తుల చివరి తేదీ ఆగస్టు 31, 2026 కాగా, పోస్ట్–మెట్రిక్ దరఖాస్తుల చివరి తేదీ అక్టోబర్ 31, 2026గా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులు గడువు తేదీలకు ముందే దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## అమ్మ మాట అంగన్ వాడీ బాటకు శ్రీకారం చుట్టిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 15చురకలు**

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు పెంపు లక్ష్యంగా నిర్వహిస్తున్న "అమ్మ మాట అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఎంజీ నగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి చిన్నారులకు రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేసి, అక్షరాభ్యాసం చేయించారు. అర్హులైన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి శాఖ అందిస్తున్న విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంత్రి, సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను నమోదు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 15చురకలు.**



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రతిభను మెరుగుపర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహారం–పాల పథకాన్ని హైదరాబాద్ జిల్లా రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించిన మంత్రి, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం అమలు చేస్తున్నామని, ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అల్పాహారం ద్వారా పౌష్టికాహారం అందడంతో పాటు విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి విద్యా ఫలితాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. బడి బాట కార్యక్రమం ద్వారా డ్రాప్‌అవుట్‌లను తగ్గించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. అల్పాహారం, పాల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.720 కోట్లు వెచ్చిస్తోందన్నారు. హైదరాబాద్ జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో 93,501 మంది విద్యార్థులు చదువుతుండగా, తొలి దశలో 45 పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల 12,437 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, మన్నా ట్రస్ట్ సీఈఓ లీనా జోసెఫ్, జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి చర్యలు

### చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**మరిపెడ,జూన్15(చురకలు)**

మరిపెడ పట్టణంలోని 13వ వార్డులో సైడ్ డ్రైనేజీలు నిర్మించాల్సిన కాలనీలను మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి సోమవారం పరిశీలించారు.కాలనీల్లో వర్షపునీరునిల్వఉండకుండా,ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు కల్పించే లక్ష్యంతో డ్రైనేజీ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను ఆమె పరిశీలించి సంబంధిత అంశాలపై స్థానికులతో చర్చించారు.ఈ సందర్భంగా కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ గంట్ల గౌతమ్ రెడ్డి,గంట్ల మహిపాల్ రెడ్డి, దేవరశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# తొలకరి పలకరింపు.. సాగుకు దుక్కులు సంసిద్ధం

**మరిపెడ,జూన్15(చురకలు)**





తొలకరి పలకరింపుతో అన్నదాత సాగుబడిలోనిమగ్నమవుతున్నారు.మరో రెండు రోజుల పాటు వర్షాలు విస్తారంగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైతులకు ఊరట లభించింది. వేసవి దుక్కులు దున్ని పక్షం రోజులు దాటినా వాన రాకపోవటంతో ఆరుతడి పంటల రైతులు కొంత నైరాశ్యంలో ఉండగా తొలకరి రావటంతో విత్తనాల కొనుగోలుకు పరుగులు పెడుతున్నారు. అదేవిధంగా నీటి సౌలభ్యత ఉన్న రైతులు ఇప్పటికే పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోగా. మరికొంత మంది వరి నారు మళ్లను సైతం సంసిద్ధం చేసుకున్నారు. మరోవైపు ఎల్ నినో పై వాతావరణ శాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ముందు జాగ్రత్త వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

**వేసవి దుక్కులు సంసిద్ధం..**

రోహిణి కార్తె ముగింపులోనే మరిపెడ పరిధిలోని అధిక శాతం రైతులు వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్నారు.మరిపెడ క్లస్టర్ పరిధిలో 51 వేల ఎకరాలు పైనే రైతులు పంటల సాగుకు సంసిద్ధం చేసుకున్నారు.అయితే భూసారాన్ని బట్టి పంట ఎంచుకోవాలని, వర్షాధారిత రైతులు తప్పనిసరిగా విత్తనాలు వేసే ముందు అధికారులను సంప్రదించి వారి సూచనలతోపంటవేసుకోవాలనిఅధికారులు సూచిస్తున్నారు.

**ఎల్ నినో తో జాగ్రత్త..**

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులతో దేశ వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎల్ నినో ఎఫెక్ట్ ఉండనుందని వాతవరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి.వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో ఆరుతడి పంటలను అధికశాతం వేసుకోవాలని సూచిస్తున్నాయి.పంట మార్పిడి చేసుకోకుండా సాగు చేస్తే దిగుబడులు తగ్గి రైతుల నష్టపోయే ప్రమాదముందని అధికారులు సూచిస్తున్నారు.రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలని,సరిపడా నీటి సౌలభ్యత లేని వారు ఆరు తడి పంటలు మినుము,పెసర,పత్తి వంటి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

**కలవర పెడుతున్న బీటి3 విత్తనాలు..**

అనుమతి లేని బీటీ–3 పత్తి విత్తనాలు వినియోగం మరోసారి ఆందోళన కలిగిస్తోంది.ఈ విత్తనాల వల్ల దిగుబడులు,పంట నాణ్యత పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచిస్తున్నారు.ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లో కుల్లం కుల్లాగా మార్కెట్లో అనధికారికంగా విత్తనాల విక్రయాలు కొనసాగుతున్నట్లు సమాచారం. అధికారిక రికార్డులు లేకుండా విక్రయాలు జరగడం వల్ల రైతులు మోసపోయే ప్రమాదం ఉందని,గత ఏడాది చాలా మంది రైతులు ఈ విత్తనాలను వేసి నష్టపోయారని అధికారులు వెల్లడించారు.అధికారుల ధ్రువీకరణ లేని,రశీదు లేని ఈ విత్తనాల వల్ల పంట నష్టం వాటిల్లిన ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందదని హెచ్చరిస్తున్నారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ రైతులు అప్రమత్తంగా ఉండి ధృవీకరించిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు**

**వీరాసింగ్,ఏవో మరిపెడ**

నకిలీ విత్తనాల నివారణకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాం. సీడ్స్ ఫెర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి విక్రయాలు జరపాలి.విత్తన విక్రయాల సమయంలో రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలి.విత్తనాలకు సంబంధించి స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి. దుకాణాల్లో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంటల నమోదు చేసుకోవాలి.బీటీ 3 విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు.బీటి 3తో మానవాళికి శారీరక జబ్బులు వచ్చే ప్రమాదముందని ఏవో వీరాసింగ్ తెలిపారు.

# మెట్రో ఫేజ్-2కు కేంద్రం సహకరించాలి..

### NOC ఇచ్చి రాష్ట్రానికే అవకాశం ఇవ్వాలి: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 15 (చురకలు)**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేదంటే ఎన్‌వోసీ (NOC) జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ప్రాజెక్టును చేపట్టేందుకు అనుమతించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మెట్రో ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని సీఎం గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి కృషితో మెట్రో ప్రాజెక్టు ఆమోదం పొందిందని తెలిపారు. అయితే తెలంగాణ ఏర్పాటుకు తర్వాత చారిత్రక కట్టడాల పేరుతో మెట్రో మొదటి దశ పనులకు ఆటంకాలు కల్పించడం వల్ల ప్రాజెక్టు మూడేళ్లు ఆలస్యమై వ్యయం భారీగా పెరిగిందన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో తొలి దశలో నష్టాలు చవిచూడటంతో రెండో దశ నిర్మాణానికి ముందుకు రావడానికి నిరాకరించిందని చెప్పారు. దీంతో కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. మెట్రోకు సంబంధించిన రూ.13,600 కోట్ల రుణాన్ని తక్కువ వడ్డీతో బదిలీ చేసేందుకు ఐఆర్ఎఫ్‌సీ, జపాన్ ఆర్థిక సంస్థలతో చర్చలు జరిపామని, అయితే ఈ ప్రక్రియను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే జపాన్ సంస్థ నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావడం లేదన్నారు. మెట్రో ఫేజ్–2 కింద 122 కిలోమీటర్ల విస్తరణకు కేంద్రం భాగస్వామ్యం వహిస్తుందా లేదా స్పష్టం చేయాలని, లేకుంటే ఎన్‌వోసీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికే బాధ్యత అప్పగించాలని సీఎం డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్ రెడ్డి ఈ విషయంలో తన బాధ్యత నిర్వర్తించాలని కోరారు. కిషన్ రెడ్డిపై వ్యక్తిగత గౌరవం ఉన్నప్పటికీ మెట్రో అంశంలో ఆయన వ్యవహరిస్తున్న తీరుపై అసహనం ఉందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

### విపత్తుల నిర్వహణ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 15(చురకలు).**

ఈ నెల 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే ప్రమాదాలను అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం ముఖ్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నైరుతి రుతుపవనాలు రాబోయే మూడు, నాలుగు రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందని, జూన్ 19 నుంచి వర్షాలు ఊపందుకుని వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు నిరంతర అప్రమత్తతతో పనిచేయాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# తల్లి తండ్రులు దైవస్వరూపులు

### సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్.

**నారాయణపేట, జూన్,15(చురకలు)**




తెలంగాణా రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులను వారి పిల్లలు గౌరవించాలని, తల్లిదండ్రులు భగవత్ స్వరూపులని, వారిని సేవించుకోవడం మన అదృష్టమని తెలిపారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ప్రాముఖ్యత తగ్గిపోతుందని ఉమ్మడి కుటుంబానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని,కానీ ఈ రోజుల్లో అందరూ ఉమ్మడి కుటుంబానికి దూరమవుతున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ, బాగోగులు, మెయింటెనెన్స్, మందులు, ఆహార అవసరాలను, ఇంట్లో ప్రశాంతత సరైన సపోర్ట్ ఇచ్చి కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ రోజుల్లో మనుషులకు ఇవ్వాల్సిన సమయాన్ని టీవీలు, ఫోన్లకు కేటాయిస్తూ వృద్ధులను వృద్ధాశ్రమాల్లో వదిలివేస్తున్నారని, వారు కూడా వృద్ధులు అవుతారని, కుటుంబ సభ్యులు కలిసిమెలిసి వృద్ధులకు సమయం కేటాయించి, వారి మనసును బాధపెట్టకుండా చూసుకోవాలని సూచించారు. ఆస్తులు రాయించుకున్న తర్వాత వృద్ధులను హింసించడం, నిరాదరణకు గురిచేయడం, రోడ్లపై వదిలివేయడం వంటి ఘటనలు జరిగితే, బాధిత వృద్ధులు కోర్టును ఆశ్రయించి కేసు వేస్తే, తల్లిదండ్రుల సంరక్షణ మరియు పోషణ చట్టం–2007 ప్రకారం ఆ ఆస్తులు తిరిగి వృద్ధులకే దక్కుతాయి" అని స్పష్టం చేశారు. వృద్ధులకు ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించాలని, ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి మురళీధర్, సీనియర్ న్యాయవాది రఘువీర్ లు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం మరియు వారికి న్యాయపరంగా లభించే చట్టాల గురించి వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మి పతి గౌడ్ ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఇట్టి సదస్సుకు న్యాయవాదులు జాగ్రతి కమిటీ సభ్యులు కాలప్ప, కుర్మన్న, నారాయణపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు, లోక్ అదాలత్ సిబ్బంది, పోలీసులు, వయోవృద్ధులు, మహిళలు మరియు కక్షిదారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక రహిత తెలంగాణ లక్ష్యం కావాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- బాల కార్మిక నిర్మూలనను సామాజిక ఉద్యమంగా మార్చాలి

**హైదరాబాద్ జూన్,15చురకలు.**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను సామాజిక ఉద్యమంగా మార్చాలని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారి పనిలో కాదు.. పాఠశాలలో ఉండాలన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పేదరికం, కుటుంబ పరిస్థితుల కారణంగా పలువురు చిన్నారులు పనుల్లోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సమాజం ముందుకు రావాలని కోరారు. చిన్నారుల బాల్యాన్ని కాపాడడం, వారికి నాణ్యమైన విద్య అందించడం అందరి బాధ్యత అని అన్నారు. విద్య ద్వారానే గౌరవప్రదమైన జీవితం సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. బాల కార్మికులుగా ఉన్న పలువురు విద్య ద్వారా మంచి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బాల కార్మిక నిర్మూలన కోసం సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే బాల కార్మిక రహిత తెలంగాణ సాధ్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన

- 'వెల్కమ్ బ్యాక్ టు స్కూల్' కార్యక్రమంలో రోడ్డు భద్రత సందేశాలు

**హైదరాబాద్, జూన్ 15:**




విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (TTI) ఆధ్వర్యంలో విద్యానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఎస్.వి.ఇ.ఎస్. స్కూల్)లో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'వెల్కమ్ బ్యాక్ టు స్కూల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, ఐపీఎస్ మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రోడ్డు భద్రత సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. విద్యార్థులకు చాక్లెట్లు, పుష్పాలు అందజేసి కొత్త విద్యా సంవత్సరానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ట్రాఫిక్ నియమాలు, రహదారి చిహ్నాలు, పాదచారుల భద్రత, జీబ్రా క్రాసింగ్‌ల వినియోగం, ఫుట్‌పాత్‌ల ప్రాముఖ్యత, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాల్సిన అవసరం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించి, ప్రజెంటేషన్లు మరియు ప్రదర్శనల ద్వారా రహదారి భద్రతా చర్యలను వివరించారు. రోడ్లు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, మొబైల్ ఫోన్ల వల్ల పరధ్యానానికి గురికాకుండా ఉండాలని, జీబ్రా క్రాసింగ్‌లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా తమ కుటుంబ సభ్యులు, సంరక్షకులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రోత్సహించాలని విద్యార్థులకు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి ఉమ్మడి బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థులు తమ కుటుంబాలు మరియు సమాజంలో రోడ్డు భద్రతా రాయబారులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, అలాగే బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది.

# కొడంగల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

- నేటి నుండి ప్రవేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్, కాడా ప్రత్యేక అధికారికి కృతజ్ఞతలు
- విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: డీఐఓ శంకర్ నాయక్




**కొడంగల్ మున్సిపల్(మం) జూన్,15(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ZPHS Girls) ఆవరణలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నేటి నుండి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం కానున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (Content/DIO) శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కళాశాలలో కింది కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నారు:

జనరల్ కోర్సులు: MPC, BPC, CEC, HEC

వొకేషనల్ కోర్సులు: MLT (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్), MPHW (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్)

**ముఖ్యమంత్రి మరియు అధికారులకు కృతజ్ఞతలు:***

కొడంగల్ నియోజకవర్గ బాలికల ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కళాశాల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేసిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మరియు కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి కి స్థానిక ఎంఈఓ మరియు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయులు (GHM)రాంరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.పట్టణంలో మరియు నియోజకవర్గ కేంద్రంలో ఈ కళాశాల ఏర్పాటు కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల పేద బాలికలకు ఎంతో మేలు జరుగుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.నేటి నుండి కళాశాల తరగతులు/అడ్మిషన్ల ప్రక్రియ జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాల వేదికగా కొనసాగుతుందని, అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# ప్రజావాణికి 20.ఫిర్యాదులు

- ప్రజావాణి కార్యక్రమానికి ప్రధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, జూన్,15(చురకలు)**

నారాయణపేట:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సీ.హెచ్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 20 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మక్తల్ మున్సిపల్ కమిషనర్ ఎస్సీ హాస్టల్ తనిఖీ చేయాలని ఆదేశించారు. స్కూల్స్, రెసిడెన్షియల్ హాస్టల్, కళాశాల లు ప్రారంభం అయినందున వాటిని తనిఖీ చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు ఆహార నాణ్యత పై రిపోర్ట్ ఇవ్వాలన్నారు. సర్ స్టార్ట్ అవుతున్నది న్యూ రోల్ నమోదు తయారు చేయాలన్నారు. బిఎల్ఓ లకు సంబంధించిన శిక్షణ ఇవ్వాలన్నారు. వీఐపీ లిస్టు తయారు చేయాలని, హౌసింగ్ రివ్యూ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన ప్రోత్సాహకుడికి గవర్నర్ అవార్డు

**నిజామాబాద్ జూన్15చురకలు.**



ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో "వ్యక్తిగత అత్యధిక రక్తదాన ప్రోత్సాహకుడు" అవార్డును రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ ప్రశాంత్ అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షురాలు శ్రీమతి ఇలా త్రిపాఠి ఆయనను అభినందించారు. తలసేమియా బాధిత చిన్నారులకు రక్తం అందుబాటులో ఉండేందుకు స్వచ్ఛంద సంస్థలు తరచూ రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆమె అన్నారు.

## గాయపడిన రిత్విక్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా



**మరిపెడ,జూన్15(చురకలు)**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకటీయ తండ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గుగులోతు సూరా నాయక్ కుమారుడు గుగులోత్ రిత్విక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా,ఆయనను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ ఆదివారం స్వగృహంలో పరామర్శించారు.ఈ సందర్భంగా రిత్విక్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే,ధైర్యంగా ఉండాలని సూచిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుగులోతు లాల్ సింగ్,బద్రు నాయక్,లింగ నాయక్, రమేష్,మంగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు

**భూపాల పల్లి జూన్ 15చురకలు.**

జిల్లాలో పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నిర్మూలన, డయేరియా నివారణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. జూన్ 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో 34,728 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే జూలై 13న 70,773 మంది పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జూన్ 16 నుంచి జూలై 31 వరకు డయేరియా నివారణ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు.

## జిల్లాలో ఆహార భద్రతపై ప్రత్యేక నిఘా

- 15 రోజులకొకసారి కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలి:
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట, జూన్ 15చురకలు.**

జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పాలు, పాల ఉత్పత్తులు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు తదితర ఆహార పదార్థాలపై నిఘా పెంచి నమూనాల సేకరణను విస్తరించాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆహార భద్రతపై కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశించారు. జాతీయ రహదారి-65 వెంట ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆహార తయారీ, నిల్వ, భద్రతపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై ఆహార భద్రత, పోలీసు, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కల్తీ ఆహారంపై ఫిర్యాదులు అందితే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల్లో అవగాహన కోసం ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు పంపిణీ

ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చేర్పర్సన్ ఢిల్లీ కర్ సరస్వతి జనార్ధన్,



**మద్దురు మున్సిపల్, జూన్,15(చురకలు)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆల్పాహార భోజనములో భాగంగా నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర లో పాలు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన మద్దూరు మున్సిపల్ చేర్పర్సన్ ఢిల్లీ కర్ సరస్వతి జనార్ధన్,ఏఎంసి చైర్మన్ నరసింహులు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ భాగ్య శంకరెడ్డి, వార్డు కౌన్సిలర్ లింగ నాయక్ రఘుపతి రెడ్డి మాజీ జెడ్పిటిసి మండల విద్యాధికారి జనార్ధన్ రెడ్డి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సవిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నరసింహారెడ్డి పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# తెలుగు రేడియో తొలి ప్రవక్త

# ఆచంట జానకీరాం

## నేడు ఆచంట జానకీరాం జయంతి

ఆచంట జానకిరాం సుప్రసిద్ధ రేడియో ప్రసార ప్రముఖులు, రచయిత. చిత్రకారులు. జానకీరామ్ 1903 జూన్ 16న జన్మించారు. ఆయన సుప్రసిద్ధ సంఘ సేవకురాలు, ఆచంట సీతమ్మ, వైద్యులు ఆచంట లక్ష్మీపతి కుమారులు. ఆయన బాల్యం అంతా మద్రాసులో గడిచింది, అడయార్‌లో మొదటి యుద్ధం రోజుల్లో కొంత కాలం మదనపల్లిలో విద్యాభ్యాసం. ఆ రోజుల్లోనే అక్కడ స్కూల్ ప్రిన్సిపాల్ గా ఉన్న జేంసు కజిన్సు శిష్యరికం. కజిన్సు జానకిరామ్‌కి చిత్ర కళలో అభిరుచి కల్పించారు. వారి సాంగత్యంలో తనెన్నో విషయాలు నేర్చుకున్నానని జానకిరామ్ తెలియజేశారు. ఆయనకు దువ్వూరి రామిరెడ్డి, అడవి బాపిరాజు లను పరిచయం చేసింది కూడా కజిన్సే. ఆ రోజుల్లోనే హోమ్ రూల్ నాయకులు అనీ బిసెంట్ అరండేల్ ల ప్రభావం పడింది. మదనపల్లి లో ఉండగానే అక్కడికి వచ్చిన రవీంద్రుడ్ని దగ్గరగా చూసే భాగ్యం కలిగింది. తండ్రి ఆచంట లక్ష్మీపతి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సంఘ సంస్కర్త. వారి పెంపకంలో జానకిరామ్‌కి ఉత్తమ సంస్కారం పుణికి పుచ్చుకున్నారు. రాజకీయ, సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కుటుంబం అవటం వల్ల ఆ ప్రభావాలన్నీ ఆయన మీద ఉన్నాయి. చిన్నప్పట్నించీ సమకాలిక మహావ్యక్తుల పరిచయ భాగ్యం లభించింది. వీరేశలింగం, గురజాడ, ఉన్నవ లాంటి సంస్కర్తలు, రచయితలు తన తండ్రితో ఇష్టాగోష్టి జరుపు తున్నప్పుడు వినే అదృష్టం కలిగింది.

అడయార్‌లో బిఎస్సీ అయ్యాక వారు కొంత కాలం విజయనగరంలో, బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో రసాయన శాస్త్ర పరిశోధనలు చేశారు. బెంగుళూరు పరిశోధనా జీవితం తర్వాత ఇన్స్యూరెన్సు కంపెనీ కార్యదర్శిగా బెజవాడ కేంద్రంగా పని చేశారు. ఆ రోజుల్లోనే ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ లోని కవి పండితులందరితో పరిచయం, స్నేహం పెరిగాయి. ఉద్దండులైన కవులు, గాయకులు, తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, అన్ని రంగాల్లోని నిష్ణాతులతో మైత్రి ఏర్పడ్డమే కాక వారి ప్రేమానురాగాలు పొందారు. ఆ రోజుల్లోనే బసవరాజు అప్పారావు తో పరిచయం కలిగింది. కవి స్వంత గొంతుకలో ఆయన రాసిన జీతాలు విన్నారు. ఆ తర్వాత ఈ పాటలు టంగుటూరి సూర్యకుమారి ఆలాపించారు. అలాగే కృష్ణశాస్త్రి, వేదుల, అబ్బూరి, చలం లతో ప్రగాఢ మైత్రి ఏర్పడింది.

1935 భారత దేశంలో రేడియో ప్రసారాలు ప్రారంభమైన కొత్తలోనే రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరారు. రేడియోలో పని చేసే రోజుల్లో బుచ్చిబాబుతో పరిచయం, స్నేహం పెరిగాయి. 1938 జూన్ 16 న మదరాసులో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా ఆచంట జానకిరాం చేరారు. తొలి డైరక్టర్ జనరల్ లైనల్ ఫీల్డెన్ నియమించిన తొలి తరం వారిలో ఆచంట ఒకరు. సున్నితమైన మనస్సు, తెల్లని దుస్తులు ధరించి కార్యక్రమ రూపకల్పనలో మేటి అనిపించుకున్నారు జానకీరామ్. మదరాసు కేంద్రం నుండి తొలి తెలుగు నాటకం ‘ అనార్కలి ‘ జానకీరామ్ ప్రయోక్తగా వెలువడింది. కొంతకాలం ఢిల్లీలో దక్షిణ భారత ప్రసారాల విభాగంలో పని చేశారు. తర్వాత తిరుచిరాపల్లి కేంద్రంలో ప్రాగ్రాం ఎగ్జిక్యూటివ్ గా పనిచేసి మదరాసు చేరారు. 120 పైగా తమిళ నాటకాలు మిత్రుల సాయంతో ప్రసారం చేశారు. ఆంధ్రదేశం నలుమూలల నుండి పండితులను పిలిపించి తెలుగు ప్రసంగాలు ఏర్పాటు చేశారు. 21 సంవత్సరాలు ఆకాశవాణిలో ప్రముఖ పదవులు నిర్వహించారు. వాణి ఎడిటర్ గా మదరాసు కేంద్రంలో ఒక దశాబ్దిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. జానకిరాం గొప్ప సౌజన్యమూర్తి, స్నేహశీలి, సౌమ్యుడు, భావుకుడు. తెలుగు, ఇంజ్లిషు, సంస్కృత భాషల్లో పండితుడు. ఈ భాషల్లోనే మంచి కవిత్వాన్ని చదివి ఆస్వాదించిన రసికుడు. తను ఆస్వాదించిన దాన్ని పది మందికి పంచి ఇవ్వగల్గిన ప్రతిభావంతుడు. నాస్మృతిపథంలో, సాగుతున్న యాత్ర రచనలు చేశారు. జానకిరాం సున్నితమైన ఆధునిక చిత్రకళ లో ప్రావీణ్యం సంపాదించారు. 170కి పైగా స్వీయ చిత్రాలను ఆంధ్ర మహిళా సభకు బహూకరించారు. ఆయన సతీమణి ఆచంట శారదాదేవి పద్మావతీ మహిళా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షురాలిగా పనిచేశారు. సీతమ్మ మరణం తరువాత ఆచంట లక్ష్మీపతి ఆచంట రుక్మిణమ్మ ను రెండవ పెళ్లి చేసుకున్నారు. రుక్మిణమ్మ అవిభక్త మదరాసు రాష్ట్రంలో ఆరోగ్యశాఖా మంత్రిణి గా ఆమె పని చేసారు. తమిళనాడు ప్రాంతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, 1946 లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మంత్రివర్గంలో ఆరోగ్య మంత్రిగా కూడా పని చేశారు. తన అరవై ఏళ్ల జీవితానుభవాన్ని గురించి జానకిరాం…“జీవితం ఒక రన్నింగ్ రేస్. అందరికీ మొదటి, రెండు, స్థానాలు రావు కదా. అందుచేత ఫలమెలా పరిణ మించినా మనం పట్టించు కోకూడదు. ఏది చేసినా బాగా మనస్సు పెట్టి చెయ్యాలి. మనిషికీ మనిషికీ మరి కాస్త అన్యోన్యత ఉండాలి. జానకిరాం పరిపూర్ణ జీవితం గడిపి తొంబై దాటాక తిరుపతిలో 1961 నుండి విశ్రాంత జీవనం గడిపి 1994లో 88 సంవత్సరాలకు తనువు చాలించి కీర్తి శేషులయ్యారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జలపాతాల పరిరక్షణకు సంకల్పం

## నేడు అంతర్జాతీయ జలపాత దినోత్సవం



ప్రకృతి మనకు అందించిన అపురూపమైన వరాలలో జలపాతాలు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. అవి కేవలం శబ్దాల సముదాయంగా మ్రోగే నీటి ప్రవాహం కాదు – ప్రకృతి సౌందర్యానికి, వైవిధ్యానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకలు. ప్రతి సంవత్సరం జూన్ 16న జరుపుకునే అంతర్జాతీయ జలపాత దినోత్సవం, ఈ సహజ అద్భుతాలను గౌరవించేందుకు, వాటి పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భం. ఈ దినోత్సవానికి 2020లో ఆరంభమైన మూలాలు అధికారికంగానీ, ప్రభుత్వ ప్రోత్సాహంతోనుగానీ ప్రారంభం కాకపోయినా, సామాజిక మాధ్యమాల్లో ప్రకృతి ప్రేమికుల చైతన్యంతో విస్తృతంగా వ్యాప్తి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జలపాతాల పట్ల అవగాహన పెంచేందుకు, వాటి పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఇది ఒక సమిష్టి ప్రయత్నంగా మారింది. జలపాతాల వైశిష్ట్యం అనేకాంశాల్లో వ్యక్తమవుతుంది. వాటి భౌగోళిక నిర్మాణం, శబ్ద గంభీరత, చుట్టూ వ్యాపించే తేమ వాతావరణం అన్నీ కలసి మనసును ముద్రించే అనుభూతిని అందిస్తాయి. విక్టోరియా, నియాగ్రా, ఏంజెల్, ఇగ్వాజు వంటి ప్రపంచ ప్రఖ్యాత జలపాతాలు లక్షలాది పర్యాటకులను ఆకర్షిస్తే, భారత దేశంలో జోగ్, అథిరప్పిలీ, దుద్‌సాగర్, నోహ్‌కలికై వంటి అద్భుతాలు దేశీయ పర్యాటక రంగానికి దన్నుగా నిలుస్తున్నాయి. జలపాతాల చుట్టుపక్కల ప్రాంతాలు అరుదైన జీవవర్గాలకు నివాసంగా మారుతాయి. తేమతో కూడిన ప్రత్యేక వాతావరణం అనేక వృక్షజాతులు, ఉభయచరాలు, పక్షులు, కీటకాలను ఆశ్రయంగా నిలబెడుతుంది. ఇదే ప్రాంతాలు పర్యావరణ శాస్త్ర పరిశోధనలకు పుణ్యక్షేత్రాలుగా మారుతున్నాయి. అంతేకాదు, నదీ ప్రవాహం, భూగర్భ నిర్మాణం, తీవ్రమైన నీటి ఒత్తిడికి సంబంధించిన అనేక శాస్త్రీయ విశ్లేషణలకు ఈ జలపాతాలు సహజ ప్రయోగశాలలుగా పనిచేస్తాయి. భారతీయ సంప్రదాయంలో జలపాతాలు పునీత స్థలాలుగా భావించ బడతాయి. హిమాలయాల్లోని కొన్ని జలపాతాలు దేవతల నివాసంగా, తీర్థయాత్రలకు పుణ్యభూమిగా ప్రసిద్ధి పొందాయి. జలమంటేనే పవిత్రత అనే భావనతో, నదీ తటాలే పరిశుద్ధతకు ప్రతీకలుగా భావించే భక్తి సాంస్కృతిక శ్రద్ధ మన సంస్కృతిలో కనిపిస్తుంది. అయితే ఈ ప్రకృతి కానుకలు పలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. పర్యాటక ఒత్తిడి, పరిశ్రమల ముట్టడి, ప్లాస్టిక్ వ్యర్థాలు, అరణ్య నిర్మూలన, గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలు కొన్ని జలపాతాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. కొన్ని జలపాతాలు అల్లుపడుతున్నాయి, మరికొన్ని తమ శక్తి కోల్పోతున్నాయి. ఇది మన నిర్లక్ష్యం వల్లే జరుగుతోంది. ఈ దినోత్సవం సందర్భంగా మనం తీసుకోవలసిన కొన్ని ముఖ్యమైన చర్యలు: జలపాతాల వద్ద చెత్త వేయక పోవడం, ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడటం. సూచించిన మార్గాల్లోనే ప్రయాణించి, వృక్షజాలాన్ని, జీవులను తారుమారు చేయకూడదు. ప్రతి నీటి చుక్క విలువైనదని గుర్తించి, దాన్ని నిర్లక్ష్యంగా వాడకూడదు. పర్యాటక అభివృద్ధిని ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా రూపొందించాలి. జలపాతాల పరిరక్షణలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలకు మద్దతు అందించాలి. జలపాతాల ప్రాముఖ్యతపై నూతన తరం యువతలో చైతన్యం కలిగించాలి. జలపాతాలను గౌరవించడం అంటే ప్రకృతిని గౌరవించడం. ఇవి కేవలం ప్రకృతి అలంకారాలు మాత్రమే కాదు – జీవ పరిణామానికి ఆధారభూతాలు. వాటి సంరక్షణ మన బాధ్యత, మన భవిష్యత్తు కోసం మనం చేయవలసిన సమిష్టి కర్తవ్యం.

# ఆదర్శ సంపాదకులు ఖాసా సుబ్బారావు

## నేడు ఖాసా సుబ్బారావు వర్ధంతి

**గాంధేయవాదానికి, నీతి నియమాలకు నిలువెత్తు దర్పణంగా, బతికిన ప్రముఖ పత్రికా సంపాదకుడు ఖాసా సుబ్బారావు.**



నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో యాజ్ఞవల్క్య బ్రాహ్మణ (ప్రథమశాఖ) సామాన్య మధ్యతరగతి కుటుంబంలో రామాబాయమ్మ, సుందర రామారావు దంపతులకు 1896, జనవరి 23న జన్మించారు. ఖాసా హైస్కూలు విద్య నెల్లూరులో పూర్తి చేసి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి ఫిలాసఫీ ప్రధాన విషయంగా డిగ్రి పుచ్చుకున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాసు కాలేజీలో వీరికి గురువు. ఈయనపై డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనల ప్రభావం జీవితాంతం ఉంది. డిగ్రి పూర్తి అయిన తరువాత న్యాయ శాస్త్రంలో పట్టా సంపాదించారు. కానీ కారణాంతరాల వల్ల న్యాయవాద వృత్తి చేపట్టలేదు.

పూర్వీకులు మహారాష్ట్ర ప్రాంతం నుండి నెల్లూరుకు వలసవచ్చారు. భార్య భవానిబాయి, తల్లి రామాబాయమ్మ లతో కలిసి నెల్లూరు జిల్లా పల్లిపాడులో గాంధీజీ ప్రారంభించిన పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఉన్నారు. చతుర్వేదుల వెంకటకృష్ణయ్య, దిగుమర్తి హనుమంతరావు, బుచ్చిక్రిష్ణమ్మ, కొండిపర్తి పున్నయ్య తదితర ఆశ్రమ వాసులతో కలిసి సత్యం, అహింస, బ్రహ్మచర్యం మొదలయిన 11 సూత్రాలను ఆచరిస్తూ, నిర్మాణకార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజమండ్రి వెళ్లి ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. నెల్లూరు జిల్లా కందుకూరు జిల్లా బోర్డు మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పదవిలో కొంతకాలం పనిచేశాడు. ఈ ఉద్యోగం అతనికి సంతృప్తిని ఇవ్వలేదు. రాత్రి వేళల్లో స్కూలు సమీపంలో ఉన్న 50 మంది వయోజనులకు చదువు చెప్పి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాడు.

### స్వాతంత్ర్యోద్యమ క్రమంలో..

గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భంలో ఖాసా సుబ్బారావు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, సత్యాగ్రహ లక్ష్యాలను ప్రజలకు వివరించడానికి అనేక చోట్ల విస్తృతంగా పర్యటించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఈయన 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1931లో మద్రాసు చైనా బజారులో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు పోలీసు లాఠీ దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావం జరిగి మూర్ఛ పోయారు. ఈ సంఘటన బ్రిటీష్ పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించింది. ఆ సంఘటనపై విచారణ జరిపిన ఏక సభ్య కమిషన్ లార్డ్ లూథియన్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాసా సుబ్బారావును పరామర్శించి లాఠీచార్జ్ ను తీవ్రంగా ఖండించింది. 1942-44ల మధ్య ఈయన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 20 నెలల కారాగార వాసం అనుభవించారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో నివసించే ఆంధ్రులు వివక్షకు గురయ్యే వారని టంగుటూరి ప్రకాశం భావించి మద్రాసాంధ్రులకు బాసటగా స్వరాజ్య పత్రికను స్థాపించి నడిపారు. ఉపాధ్యాయ వృత్తి తర్వాత 1921లో ఖాసా సుబ్బారావు మద్రాసుకు వెళ్ళి, ఓసారి జాతీయ భావాల ప్రచార కార్యక్రమంలో భాగంగా మద్రాసులోని స్వరాజ్య పత్రిక కార్యాలయానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు ఖాసా లోని దేశభక్తిని గమనించి తన బదులు స్వరాజ్య పత్రికలో సంపాదకీయం రాయడానికి సుబ్బారావును కోరారు. అది మొదలు సుబ్బారావు పత్రికా లోకంలో తన వైభవాన్ని విశేషంగా చాటు కున్నారు. భాష, భావ వ్యక్తీకరణ, స్పష్టత, నిర్భీతి లాంటి గుణాల వల్ల సుబ్బారావును పాఠక లోకం విశేషంగా అభిమానించింది. అప్పటి నుండి ఖాసాకు పత్రికా రంగంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. అలా ఖాసా సుబ్బారావు చివరకు జర్నలిజం లోనే స్థిరపడి పోయారు. ఈ పత్రికకు ప్రకాశం పంతులు మేనేజింగ్ డైరెక్టర్‌గా, సంపాదకుడిగా వ్యవహరించాడు. కె.ఎం.ఫణిక్కర్ ఇన్‌ఛార్జ్ ఎడిటర్‌గా వ్యవహరించేవారు. ఖాసా సుబ్బారావుతో పాటు ఎస్.ఎన్.వరదాచారి, కోలవెన్ను రామకోటేశ్వర రావు, ఎం.చలపతిరావు మొదలైన వారు ఈ పత్రిక ఉప సంపాదకులుగా వ్యవహరించారు.

జాతీయ భావాలు అధికంగా ఉన్న ఖాసాను ప్రకాశం పంతులు ఏరికోరి తన పత్రిక సంపాదకునిగా నియమించు కున్నారు. రాజాజీతో పాటు పలువురు రాజకీయ ఉద్దండులు ఆయన కలంపోటుకు గురయ్యారు. అయినప్పటికీ అందరూ ఆయన్ను ఎంతో గౌవించే వారు. అభిమానించే వారు. టంగుటూరి ప్రకాశం ఈ పత్రికలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించలేక పోతే ఖాసా కార్మికుల పక్షాన నిలిచారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రకాశంకు ఘాటైన లేఖలు వ్రాసేవారు. ఆర్థిక సంక్షోభం వల్ల ఈ పత్రిక మూతబడింది.

1936 వరకు స్వరాజ్యలో పనిచేసిన ఖాసా అనంతరం కోల్‌కతా నుండి వెలువడే ఇండియన్ ఫైనాన్స్, ముంబాయి నుండి వెలువడే ఫ్రీ ప్రెస్ జర్నల్‌లో పని చేశారు. ఆ తరువాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాయింట్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రభకు తొలి సంపాదకులు ఆయనే.

స్వతంత్ర భావాలు కలిగిన ఖాసా ఇతర పత్రికలలో ఇమడలేక స్వంతంగా పత్రికను ప్రారంభించారు. తన మిత్రుడు ఉప్పులూరి కాళిదాసు సహకారంతో 1946లో స్వతంత్ర అనే ఆంగ్ల వార పత్రికను ప్రారంభించారు. 1948లో తెలుగు స్వతంత్రను ప్రారంభించారు. ఈ రెండు వార పత్రికలను పదేళ్ల పాటు బలమైన రాజకీయ వార్తా పత్రికలుగా నడిపారు. తెలుగు స్వతంత్రలో చాలా అపురూపమైన సాహిత్యం చోటు చేసుకుంది. ఆ రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం తొలినాళ్ళలో లేకున్నా అప్పటికి ఔత్సాహిక రచయిత అయిన భరాగో ఉత్తరంలో కోరడంతో సరిదిద్దుకుని ఆపైన రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం ప్రారంభించారు.

నైతిక విలువలతో నీతినియ మాలతో జీవించిన ఆయన 1961 జూన్ 16న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# పసిడి ధరలకు రెక్కలు

హైదరాబాద్, జూన్ 15: అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరి పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినప్పటికీ, దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెరగడంతో పసిడి ధరలు ఎగబాకినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ రిటర్న్స్ గణాంకాల ప్రకారం, నేడు దేశవ్యాప్తంగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర గత ముగింపుతో పోలిస్తే రూ.2,450 పెరిగి సగటున రూ.1,51,530కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,250 పెరిగి రూ.1,38,900గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,840 పెరిగి రూ.1,13,650కు చేరింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,900కు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,490గా నమోదవగా, న్యూఢిల్లీలో రూ.1,51,680కు చేరింది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉంది. లక్నోలో రూ.1,51,680, వడోదరా మరియు భోపాల్‌లో రూ.1,51,580గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,40,700కు చేరగా, న్యూఢిల్లీ మరియు లక్నోలో రూ.1,39,050గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, నాగ్‌పూర్ నగరాల్లో రూ.1,38,900గా నమోదైంది. మరోవైపు 18 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,18,000గా ఉండగా, న్యూఢిల్లీ, లక్నోలో రూ.1,13,800, ముంబై, కోల్‌కతా, బెంగళూరులో రూ.1,13,650గా నమోదైంది. బంగారం ధరల్లో ఒకేరోజు భారీ పెరుగుదల నమోదవడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధోరణులను బట్టి పసిడి ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రూపాయి దూకుడు

**ముంబై, జూన్ 15 :** అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న కీలక పరిణామాల ప్రభావంతో భారత రూపాయి నేడు అమెరికా డాలర్‌తో పోలిస్తే గణనీయంగా బలపడింది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తలతో ముడి చమురు ధరలు భారీగా పడిపోవడంతో రూపాయి ఒకేరోజు 58 పైసలు లాభపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 94.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, అనంతరం మరింత బలపడి 94.60 స్థాయికి చేరుకుంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.18 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన శాంతి ఒప్పందం ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సానుకూల సంకేతాలను పంపింది. ఇరాన్‌తో ఒప్పందం పూర్తయిందని, వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన హార్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశముందని ఆయన వెల్లడించారు. ప్రపంచ ముడి చమురు రవాణాలో కీలకమైన ఈ జలమార్గం మళ్లీ అందుబాటులోకి రానుండటంతో సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తగ్గాయి. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు ఐదు శాతం పడిపోయి 83 డాలర్లకు చేరుకోగా, అమెరికా ముడి చమురు ధర కూడా ఐదు శాతానికి పైగా తగ్గి 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ముడి చమురు ధరల తగ్గుదల భారత్‌కు అనుకూలంగా మారిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటైన భారత్‌కు దిగుమతి వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గనుంది. దీంతో పాటు దేశ కరెంట్ అకౌంట్ లోటు కూడా నియంత్రణలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అమెరికా డాలర్ బలహీనపడటం, అమెరికా ట్రెజరీ బాండ్లపై లాభదాయకత తగ్గడం, ఆసియా మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొనడం వంటి అంశాలు కూడా రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో రూపాయి మరింత పుంజుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దు: నిర్మలా



**న్యూఢిల్లీ, జూన్ 15 :** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంతృప్తికరంగా రాణిస్తున్నప్పటికీ, ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీర్ఘకాలికంగా అభివృద్ధి కొనసాగాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు. 'మైండ్‌మైన్ సమ్మిట్-2026'లో పాల్గొన్న నిర్మలా సీతారామన్ దేశ ఆర్థిక పరిస్థితులపై మాట్లాడారు. భారతదేశం ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తున్నప్పటికీ, పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఎక్కడ మెరుగుదలకు అవకాశం ఉందో గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం మాత్రమే సరిపోదని, స్థిరమైన మరియు సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. భారతదేశం వంటి విస్తృతమైన, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని కొనసాగించాలంటే సామర్థ్యాలను పెంపొందించడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూడడం అత్యవసరమన్నారు. పురోగతి సహజంగా వస్తుందని భావించడం సరైంది కాదని, వృద్ధి వేగాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, కొత్త ఆలోచనలు, సంస్కరణలు తప్పనిసరని ఆమె అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలు ప్రస్తుతం మంచి పనితీరు కనబరుస్తున్నప్పటికీ, ముఖ్యంగా మధ్యంతర ఉత్పత్తులు, సంక్లిష్ట తయారీ రంగాలు, సేవల రంగాలకు ఇంకా విధానపరమైన మద్దతు అవసరమని అంళకరించారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు విధానాలు, కొత్త విధాన నిర్ణయాల ద్వారా అధిగమించే దిశగా విధానకర్తలు నిరంతరం ఆలోచించాలని ఆమె సూచించారు. ఇదే సమయంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో కారణంగా రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన సన్నాహాలు చేస్తోందని తెలిపారు.


# ఆన్‌లైన్ మోసాలతో ఏటా వేల కోట్ల నష్టం

**న్యూఢిల్లీ, జూన్ 15:** దేశంలో ఇ-వాణిజ్య రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్ వేదికలు అనుసరిస్తున్న మోసపూరిత డిజిటల్ విధానాల కారణంగా వినియోగదారులు భారీగా ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. 'డేటమ్ ఇంటెలిజెన్స్' విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ తరహా తప్పుడు విధానాల వల్ల భారతీయ వినియోగదారులు ఏటా రూ.25 వేల కోట్ల నుంచి రూ.28 వేల కోట్ల వరకు నష్టపోతున్నారు. దేశంలోని సుమారు 30.4 కోట్ల మంది డిజిటల్ వినియోగదారుల్లో దాదాపు 88 శాతం మంది దాచిపెట్టిన రుసుములు, బలవంతపు కొనుగోళ్లు, చివరి దశలో అదనపు చార్జీలు జోడించడం వంటి పద్ధతుల కారణంగా ప్రతి నెలా సగటున రూ.78 నుంచి రూ.87 వరకు నష్టపోతున్నట్లు నివేదిక పేర్కొంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఈ ఏడాది జనవరిలో పలు సంస్థలపై రూ.44 లక్షల జరిమానాలు విధించినప్పటికీ, 73 శాతం ఆన్‌లైన్ వేదికలు ఇప్పటికీ వినియోగదారులను ఒత్తిడికి గురిచేసే వ్యాపార విధానాలను కొనసాగిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. అలాగే 69 శాతం సంస్థలు కొనుగోలు చివరి దశలో అదనపు




చార్జీలు జోడించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తేలింది. వినియోగదారుల విశ్వాసం విషయంలో ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ అమెజాన్ అగ్రస్థానంలో నిలిచింది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది వినియోగదారులు అమెజాన్‌ను అత్యంత విశ్వసనీయ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, మింత్రా, నైకా వంటి సంస్థలపై వినియోగదారుల్లో ప్రతికూల అభిప్రాయం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌పై 41 శాతం మంది వినియోగదారులు విశ్వాసం లేదని వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియలో అదనపు రుసుములు వసూలు చేయడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. ప్రయాణ సేవల విభాగంలో మేక్‌మైట్రిప్ అత్యంత విశ్వసనీయ వేదికగా నిలవగా, క్లియర్‌ట్రిప్‌పై ఎక్కువ ఫిర్యాదులు నమోదైనట్లు అధ్యయనం తెలిపింది. త్వరిత సరఫరా సేవల రంగంలో బిగ్‌బాస్కెట్ అత్యంత బలహీన పనితీరు నమోదు చేసిన సంస్థగా గుర్తించబడింది. ఈ మోసపూరిత విధానాల కారణంగా వినియోగదారులు ప్రత్యామ్నాయ వేదికలకు మారిపోతుండటంతో సుమారు రూ.55 వేల కోట్ల విలువైన వ్యాపారం ప్రమాదంలో పడే అవకాశముందని నివేదిక హెచ్చరించింది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రస్తుత నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు డిజిటల్ వాణిజ్య రంగానికి అనుగుణంగా చట్టాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏఐ లాభాలు కొందరికే పరిమితం కాకూడదు: సత్య నాదెళ్ల



**న్యూఢిల్లీ, జూన్ 15 :** కృత్రిమ మేధస్సు సాంకేతికత ప్రపంచ వ్యాపార వ్యవస్థలను వేగంగా మార్చేస్తున్నప్పటికీ, గత ఆర్థిక, పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సత్య నాదెళ్ల హెచ్చరించారు. సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్న తన విశ్లేషణలో ఆయన కృత్రిమ మేధస్సు భవిష్యత్తు, ఆర్థిక సమానత్వం, పరిశ్రమల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా వచ్చే లాభాలు, అవకాశాలు కేవలం కొద్ది పెద్ద సాంకేతిక సంస్థలకే పరిమితమైతే, అనేక పరిశ్రమలు తమ విలువను, నైపుణ్యాన్ని, పోటీతత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భద్రత, వ్యాపారాల భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కృత్రిమ మేధస్సును కేవలం ఉత్పాదకత పెంచే సాధనంగా మాత్రమే చూడడం సరైన దృక్పథం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచం గత సాంకేతిక విప్లవాల కంటే భిన్నమైన దశలోకి ప్రవేశించిందని, భవిష్యత్తులో మనుషులు మరియు కృత్రిమ మేధస్సు వ్యవస్థలు పరస్పరం ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియను ఆయన "జ్ఞాన పరస్పర చక్రం"గా అభివర్ణించారు. భవిష్యత్తులో సంస్థలు రెండు రకాల మూలధనాలను నిర్మించుకోవాల్సి ఉంటుందని నాదెళ్ల వివరించారు. ఉద్యోగుల అనుభవం, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం, సంబంధాలతో కూడిన మానవ మూలధనం ఒక వైపు ఉండగా, సంస్థలు స్వయంగా అభివృద్ధి చేసుకునే కృత్రిమ మేధస్సు సామర్థ్యాలతో కూడిన సాంకేతిక మూలధనం మరోవైపు ఉంటుందని చెప్పారు. కృత్రిమ మేధస్సును మానవ శ్రమకు ప్రత్యామ్నాయంగా చూడటం సరైన విధానం కాదని, ఎంత అధునాతన సాంకేతికత వచ్చినా మానవ మేధస్సు, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యానికే అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతికత మరియు మానవ నైపుణ్యం కలిసి పనిచేసినప్పుడే సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన ప్రయోజనాలు లభిస్తాయని నాదెళ్ల పేర్కొన్నారు.



# వేదాంత డీమర్జర్ పూర్తి..

## ఐదు కంపెనీల షేర్ల ట్రేడింగ్ ప్రారంభం

**ముంబై, జూన్ 15 :** గనులు, లోహాలు, ఇంధన రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ వేదాంత గ్రూప్ డీమర్జర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తైంది. విభజన అనంతరం ఏర్పడిన నాలుగు కొత్త కంపెనీల షేర్లు సోమవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ ప్రారంభించాయి. దీంతో వేదాంత గ్రూప్‌కు చెందిన మొత్తం ఐదు కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వచ్చాయి. వేదాంతా లిమిటెడ్‌తో పాటు వేదాంతా అల్యూమినియం మెటల్స్, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీల షేర్లు మార్కెట్లో అరంగేట్రం చేశాయి. వీటిలో వేదాంతా అల్యూమినియం మెటల్స్ షేర్ బీఎస్‌ఈలో రూ.527 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, రోజులో రూ.538 గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో ఆ సంస్థ మార్కెట్ విలువ సుమారు రూ.1.95 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతా పవర్ షేర్ రూ.41.30 వద్ద లిస్టయి, సంస్థ మార్కెట్ విలువ రూ.16,736 కోట్లకు చేరింది. వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ సంస్థ మార్కెట్ విలువ రూ.14,487 కోట్లుగా నమోదవగా, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ సంస్థ మార్కెట్ విలువ రూ.8,231 కోట్లకు చేరింది. డీమర్జర్ పథకం ప్రకారం మే 1ను రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆ తేదీ నాటికి వేదాంతా లిమిటెడ్ షేర్లు కలిగి ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీల్లో ఒక్కో షేర్ కేటాయించారు. అంటే ఒక వేదాంతా షేర్ కలిగి ఉన్న పెట్టుబడిదారుడికి అదనంగా నాలుగు కొత్త కంపెనీల్లో ఒక్కో షేర్ చొప్పున లభించింది. ఈ డీమర్జర్ ద్వారా వేదాంత గ్రూప్ తన వ్యాపార విభాగాలను స్వతంత్ర సంస్థలుగా మార్చి, పెట్టుబడిదారులకు మరింత విలువ సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు




మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త కంపెనీలు స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో వృద్ధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికాపై అద్భుత పునరాగమనం చేసిన భారత మహిళల హాకీ జట్టు



**న్యూజిలాండ్, జూన్ 15:** ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు ఉత్కంఠభరిత విజయంతో టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో అమెరికా జట్టుపై 3-2 గోల్స్ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ ప్రారంభం నుంచే అమెరికా జట్టు దూకుడు ప్రదర్శించింది. ఫస్ట్ క్వార్టర్‌లో వరుసగా రెండు గోల్స్ సాధించి 2-0 ఆధిక్యంలోకి వెళ్లడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఈ దశలో మ్యాచ్ పూర్తిగా అమెరికా చేతుల్లోకి వెళ్తుందన్న అంచనాలు కూడా వినిపించాయి. అయితే రెండో క్వార్టర్‌లో భారత జట్టు అసాధారణ పునరాగమనం చేసింది. ఆత్మవిశ్వాసంతో ఆటను మార్చిన భారత్ వరుసగా మూడు గోల్స్ సాధించి మ్యాచ్‌ను పూర్తిగా తనవైపు తిప్పుకుంది. భారత్ తరఫున దీపిక రెండు కీలక గోల్స్ సాధించగా, నవనీత్ ఒక గోల్‌తో స్కోరుబోర్డును సమం చేసి ఆధిక్యాన్ని అందించారు. ఈ మూడు గోల్స్‌తో భారత్ 3-2 ఆధిక్యంలోకి వెళ్లి చివరి వరకు ఆ లీడ్‌ను కాపాడుకుంది. చివరి క్వార్టర్లలో అమెరికా జట్టు తిరిగి గోల్స్ సాధించేందుకు ప్రయత్నించినప్పటికీ భారత డిఫెన్స్ సమర్థంగా నిలిచి ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. దీంతో భారత్ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. క్రికెట్‌లో పాకిస్థాన్‌పై టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత వెంటనే హాకీలోనూ అమెరికాపై గెలవడంతో భారత క్రీడాభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.



## మరోసారి నిరాశపరిచిన వైభవ్

**కొలంబో, జూన్ 15 :** భారత 'ఎ' జట్టు తరఫున ఆడుతున్న యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి నిరాశపరిచాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక 'ఎ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో అతడు ఆశించిన స్థాయిలో రాణించలేక త్వరగానే పెవిలియన్ చేరాడు. ఇటీవల దేశీయ టోర్నీల్లో, ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో 21 పరుగులకే అవుటయ్యాడు. శ్రీలంక బౌలర్ సమన్ అరాచిగే బౌలింగ్‌లో అతడు వికెట్ సమర్పించుకున్నాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేక 11 పరుగుల వద్ద వెనుదిరిగాడు. షిరాజ్ బౌలింగ్‌లో అతడు అవుట్ కావడంతో భారత 'ఎ' జట్టు 39 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ల వైఫల్యంతో జట్టు ఒత్తిడిలో పడగా, కెప్టెన్ తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇద్దరూ జాగ్రత్తగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపించారు. మ్యాచ్ ప్రారంభ దశలోనే రెండు వికెట్లు కోల్పోయినప్పటికీ మధ్యవరుస బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడితే భారత 'ఎ' జట్టు పోటీ స్కోరు సాధించే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 13 ఓవర్లు ముగిసే సమయానికి భారత 'ఎ' జట్టు 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ 23 పరుగులతో, తిలక్ వర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

## ప్రపంచకప్ ఆర్చరీలో బొమ్మదేవర ధీరజ్ డబుల్ గోల్డ్



**విజయవాడ, జూన్ 15:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్రశ్రేణి ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ అద్భుత ప్రదర్శనతో రెండు స్వర్ణ పతకాలు సాధించి దేశ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటాడు. రికర్వ్ విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ధీరజ్ తన అసాధారణ నైపుణ్యంతో వరుస విజయాలు సాధించి 'డబుల్ గోల్డ్' సాధించాడు. మొదటగా మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన 17 ఏళ్ల కుంకుమ్ మొహోద్‌తో కలిసి భారత్‌కు స్వర్ణ పతకం అందించాడు. ఆ తర్వాత జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగంలో కూడా అదే ఫామ్‌ను కొనసాగించిన ధీరజ్, ఫైనల్‌లో అద్భుత ప్రదర్శనతో మరో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ విజయంతో ఒకే టోర్నీలో రెండు బంగారు పతకాలు సాధించిన అరుదైన ఘనతను నమోదు చేశాడు. ఈ అసాధారణ విజయంతో ధీరజ్ ప్రతిష్టాత్మక వరల్డ్ కప్ ఫైనల్స్‌కు అర్హత సాధించి మరో చారిత్రాత్మక మైలురాయిని చేరాడు. ధీరజ్ విజయంపై రాజకీయ, క్రీడా వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ధీరజ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యువ ఆర్చర్ ప్రదర్శన దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని పలువురు క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## ఏఐ వీడియోతో క్రికెట్ అభిమానుల్లో గందరగోళం

**బర్మింగ్‌హామ్, జూన్ 15 :** కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధితో నకిలీ వీడియోల ముప్పు పెరుగుతోంది. తాజాగా భారత్--పాకిస్థాన్ మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌కు సంబంధించి కృత్రిమ మేధతో రూపొందించిన ఒక నకిలీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో క్రికెట్ అభిమానులు గందరగోళానికి గురయ్యారు. వైరల్ అవుతున్న వీడియోలో భారత, పాకిస్థాన్ మహిళా క్రికెటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగినట్లు చూపించారు. భారత బ్యాటర్‌ను పాకిస్థాన్ క్రీడాకారిణి రెచ్చగొట్టినట్లు, అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు చిత్రీకరించారు. అంపైర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చినట్లు కూడా వీడియోలో చూపించారు. అయితే మ్యాచ్‌లో వాస్తవానికి ఇలాంటి ఘటన ఏదీ జరగలేదని స్పష్టమైంది. కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఈ నకిలీ వీడియోను కొందరు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో అభిమానులు మొదట నిజమని భావించారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ అద్భుత విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. గ్రూప్-ఏలో భాగంగా జరిగిన పోరులో పాకిస్థాన్‌పై 64 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఉప కెప్టెన్ స్మృతి మంధాన 68 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 36 పరుగులు చేసింది. రిచా ఘోష్ 34 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరు అందించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్థాన్ జట్టు భారత స్పిన్నర్ల ధాటికి 17 ఓవర్లలో 106 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ మునీబా అలీ 41 పరుగులతో పోరాడినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ ఐదు వికెట్లు తీసి పాకిస్థాన్ పతనాన్ని శాసించింది. తెలుగు యువ బౌలర్ శ్రీచరణి మూడు వికెట్లు పడగొట్టి ఆకట్టుకుంది. అద్భుత ప్రదర్శన చేసిన దీప్తి శర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ శుభారంభం చేయగా, తదుపరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. మరోవైపు కృత్రిమ మేధతో రూపొందించిన నకిలీ వీడియోల పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కోహ్లీపై రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 15:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మైదానంలో కోహ్లీ అహంకారి, పొగరుబోతుగా కనిపిస్తాడన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. కోహ్లీకి సంబంధించిన 'వన్8' లైఫ్‌స్టైల్ బ్రాండ్ నిర్వహించిన సంభాషణలో రవిశాస్త్రి మాట్లాడుతూ.. "మైదానంలో కోహ్లీ అత్యంత దూకుడుగా, అగ్రెసివ్‌గా ఉంటాడు. కానీ అది కేవలం ఆటపైన ఉన్న ప్యాషన్ మాత్రమే. దాన్ని అహంకారంగా భావించడం సరికాదు" అని అన్నారు. ఆట ముగిసిన వెంటనే కోహ్లీ వ్యక్తిత్వం పూర్తిగా మారిపోతుందని రవిశాస్త్రి వెల్లడించారు. "ఫీల్డ్ బయట అతను చాలా వినమ్రంగా, సౌమ్యంగా ఉంటాడు. అందరితో ఆత్మీయంగా మాట్లాడే వ్యక్తి" అని ఆయన పేర్కొన్నారు. కోహ్లీ గురించి సమాజంలో ఉన్న అతిపెద్ద అపోహ ఇదేనని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. మైదానంలో కనిపించే అగ్రెషన్‌ను వ్యక్తిత్వంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2017-2021 మధ్య కోచ్-కెప్టెన్‌గా వీరిద్దరి కలయికలో భారత జట్టు అనేక చారిత్రాత్మక విజయాలు సాధించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా విదేశీ గడ్డపై టెస్టు విజయాలు ఈ ద్వయం సమన్వయానికి నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## ఫిఫా వరల్డ్‌కప్‌లో కొత్త ఒరవడి

### క్రికెట్ 'స్నికో మీటర్' పనికొచ్చిందిలా!

ఆద్యంతం ఉత్కంఠగా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ అభిమానులను అలరిస్తోంది. ఈసారి సాకర్ పండుగ ప్రత్యేకత ఏంటంటే.. మునుపెన్నడూ లేని విధంగా గోల్ నిర్ధరణ కోసం క్రికెట్ పరిజ్ఞానం ఉపయోగించారు. క్రికెట్‌లో చాలా సాధారణంగా కనిపించే స్నికో మీటర్ వాడకం అందరిలోనూ ఆసక్తి రేపింది. స్వీడన్, ట్యునీషియా మ్యాచ్‌లో స్నికో మీటర్ ఆధారంగా గోల్ వేసింది ఎవరు? అనేది నిర్ణయించారు. గ్రూప్ ఎఫ్‌లోని స్వీడన్ తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. ట్యునీషియాపై 5-1తో జయభేరి మోగించి ముందంజ వేసింది. అయితే.. మ్యాచ్‌లో నాలుగో గోల్ నిర్ధరణపై ఉత్కంఠ నెలకొనగా రిఫరీలు క్రికెట్ పరిజ్ఞానాన్ని ఆశ్రయించారు. క్రికెట్‌లో బ్యాట్‌కు బంతి తగిలిందా? లేదా? అనేది తెలుసుకోవడం కోసం ఉపయోగించే ఈ సాంకేతికతను గోల్ నిర్ధరణకు వాడారు. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మాట్టియాస్ స్వాన్‌బెర్గ్ 18 సెకన్లలోనే గోల్ కొట్టగానే స్వీడన్ ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు. అయితే.. అసిస్టెంట్ రిఫరీ మాత్రం కార్డు చూపిస్తూ గోల్ కాదని చెప్పాడు. దాంతో, స్వీడన్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. అలెగ్జాండర్ ఇజాక్ కాలు సైతం తగిలినట్టు అనిపించడంతో గోల్ కొట్టింది ఎవరు? అనేది తేల్చడం కోసం రిఫరీలు స్నికో మీటర్ సాయం తీసుకున్నారు. స్నికోలో ఇజాక్ కాలు దాటిన తర్వాత స్పైక్ కనిపించింది. సో.. ఆ గోల్ కొట్టింది స్వాన్‌బెర్గ్ అని తేలింది.

## భారత్ చేతిలో పాక్ ఓటమి

### హ్యాండ్‌షేక్ వివాదంపై చర్చ



**బర్మింగ్‌హామ్, జూన్ 15 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. అయితే మ్యాచ్ అనంతరం కూడా ఇరుజట్ల ఆటగాళ్లు హ్యాండ్‌షేక్ చేసుకోకపోవడం మరోసారి వివాదానికి దారి తీసింది. మ్యాచ్ ప్రారంభంలో టాస్ సమయంలోనూ, ఆట ముగిసిన తర్వాతనూ ఇరుజట్ల ఆటగాళ్లు పరస్పరం హ్యాండ్‌షేక్ చేయకపోవడం గమనార్హం. దీనిపై క్రికెట్ వర్గాల్లో, అభిమానుల్లో చర్చ మొదలైంది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పాకిస్థాన్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్‌ను ఈ అంశంపై ప్రశ్నించారు. ఆయన స్పందిస్తూ, హ్యాండ్‌షేక్ జరగకపోవడానికి గల అసలు కారణాలపై తనకు స్పష్టమైన సమాచారం లేదని చెప్పారు. తాను చాలా కాలం క్రితమే క్రికెట్‌కు దూరమయ్యానని పేర్కొన్న ఆయన, "ఇలాంటి పరిస్థితులు కొనసాగాలనుకుంటే అలాగే కొనసాగనివ్వాలి. హ్యాండ్‌షేక్ వల్ల పెద్దగా మార్పు ఏమీ ఉండదు" అని వ్యాఖ్యానించారు. మ్యాచ్ విషయానికి వస్తే భారత మహిళల జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం చూపించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. భారత ఇన్నింగ్స్‌లో స్మృతి మంధాన అద్భుతంగా ఆడి 68 పరుగులు సాధించగా, హర్మన్‌ప్రీత్ కౌర్ 36 పరుగులు చేశారు. రిచా ఘోష్ 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు స్కోరు పెంచారు. లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ జట్టు భారత స్పిన్నర్ల ముందు తేలిపోయింది. 17 ఓవర్లలో 106 పరుగులకే ఆ జట్టు ఆలౌట్ అయింది. ఓపెనర్ మునీబా అలీ 41 పరుగులతో కొంత ప్రతిఘటన చూపినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత విజయంలో దీప్తి శర్మ ప్రధాన పాత్ర పోషించింది. ఆమె ఐదు వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చింది. ఇదే ప్రదర్శనతో మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు (166) తీసిన బౌలర్‌గా ఆమె కొత్త రికార్డు సృష్టించింది. శ్రీచరణి మూడు వికెట్లు తీసి అద్భుతంగా సహకరించారు. ఈ విజయంతో భారత మహిళల జట్టు టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది. మరోవైపు హ్యాండ్‌షేక్ వివాదం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# 'వారణాసి' క్లైమాక్స్‌కు భారీ ఏర్పాట్లు

## మహేష్ - రాజమౌళి చిత్రంలో గ్రాండ్ యాక్షన్ ఎపిసోడ్!

సూపర్ స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం *'వారణాసి'*పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్ర బృందం క్లైమాక్స్ చిత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నారని, అందులోనే కీలక పోరాట సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా మహేష్ బాబు అభిమానులను ఆకట్టుకునేలా ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక కథలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా జోనస్ 'మందాకిని' పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతుండగా, మహేష్ బాబు 'రుద్ర' పాత్రతో పాటు మరో కీలక పాత్రలోనూ నటిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశాలపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత కేఎల్ నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ ఎస్ కార్తికేయా నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. సంగీతాన్ని ఎం ఎం కీరవాణి అందిస్తుండగా, కథను వీ విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. సంభాషణలను దేవ కట్ల రాస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో, ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో విడుదల చేయాలని చిత్ర బృందం ప్రణాళికలు రూపొందిస్తోంది. అయితే చిత్రానికి సంబంధించిన కథ, పాత్రలు, బడ్జెట్ వంటి వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'సుభాష్'గా ఆర్యన్ శ్యామ్



భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత కథ ఆధారంగా ఓ ప్రతిష్టాత్మక బయోపిక్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ (జెమిని ఫిల్మ్ సర్క్యూట్) నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'సుభాష్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో నేతాజీ పాత్రను యువ నటుడు ఆర్యన్ శ్యామ్ పోషించనుండగా, దర్శకుడు ఆనంద్ వి. ప్రసాద్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. సుభాష్ చంద్రబోస్ అసాధారణ జీవిత ప్రయాణం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర, దేశభక్తి భావజాలం, నాయకత్వ లక్షణాలను ఈ చిత్రంలో ఆవిష్కరించను న్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాట స్ఫూర్తి, దేశ చరిత్రపై చూపిన ప్రభావం వంటి అంశాలను విస్తృత పరిశోధనల ఆధారంగా తెరపైకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.





# 'డ్రాగన్'లో కృతి సనన్ ఎంట్రీ?

యంగ్ టైగర్ జూనియర్ఎ న్టీ రామారావు జూనియర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'పై తాజాగా ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఇప్పటికే పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతుండగా, తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కథకు సంబంధించిన ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ప్రశాంత్ నీల్, అసలు కథలోని కీలక సంఘర్షణను మాత్రం రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఆ ప్రధాన కథా ట్రాక్‌లోనే కృతి సనన్ పాత్ర ఉండొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమాలు డార్క్ టోన్, బ్లాక్ అండ్ గ్రే షేడ్ విజువల్స్‌తో ప్రత్యేక గుర్తింపు పొందుతాయి. అయితే 'డ్రాగన్'లోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను పూర్తిగా కలర్‌ఫుల్ విజువల్స్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈ భాగంలో ప్రశాంత్ నీల్ శైలికి భిన్నమైన విజువల్ ట్రీట్ కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్Arts సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.




# సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్నా!

టాలీవుడ్ నటి నివేదా పేత్‌రాజ్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. 'అలా వైకుంఠపురములో', 'బ్రోచేవారెవరురా', 'రెడ్', 'పాగల్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన ఆమె, కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' సినిమా సక్సెస్ మీట్‌లో పాల్గొన్న నివేదా పేతురాజ్, తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో తాను సినిమాలకు పూర్తిగా గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి వచ్చానని, ఆ సమయంలో తన ప్రణాళికలు అనుకున్నట్లుగా సాగలేదని తెలిపారు. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత 'సింగ్ గీతం'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మరో అవకాశం ఇచ్చిన నాగ్ అశ్విన్ వల్లే తాను మళ్లీ సినిమాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. "నాగ్ అశ్విన్ నాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఆయన ప్రోత్సాహం లేకపోయి ఉంటే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్నో కాదో తెలియదు" అంటూ భావోద్వేగంగా స్పందించారు. కాగా, ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' చిత్రానికి ప్రముఖ దర్శకుడు సంగీతం శ్రీనివాస్‌రావ్ దర్శకత్వం వహించగా, నాగ్ అశ్వన్ నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది.

# రాజ్ నిడిమోరు మూవీలో సల్మాన్ ఖాన్?



'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి విజయవంతమైన వెబ్ సిరీస్‌లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాజ్ నిడిమోరు ఇప్పుడు ఓ భారీ బాలీవుడ్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్నాయని, అది ప్రీ – ప్రొడక్షన్ దశలో ఉందని రాజ్ తెలిపారు. అలాగే మరో వెబ్ సిరీస్ అభివృద్ధి దశలో ఉండగా, తమ హిందీ సినిమా నిర్మాణం కూడా త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టు కునేలా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.



# 'ధ్రువ నక్షత్రం'పై కీలక తీర్పు..

## గౌతమ్ మీనన్‌కు మరో అవకాశం దక్కుతుందా?

చియాన్ విక్రమ్ హీరోగా, దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తెరకెక్కించిన 'ధ్రువ నక్షత్రం' చిత్రం విడుదల సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. నిర్మాతలు, పెట్టుబడిదారులు, ఫైనాన్షియర్ల మధ్య నెలకొన్న ఆర్థిక వివాదాల కారణంగా ఈ సినిమా చాలా కాలంగా విడుదలకు నోచుకోలేదు. ఇప్పటికే పలు దఫాల విచారణల అనంతరం, జూన్ 15లోపు సినిమాను విడుదల చేస్తానని గౌతమ్ మీనన్ మద్రాస్ హైకోర్టుకు హామీ ఇచ్చారు. ఆ మేరకు కోర్టు ఆయనకు గడువు కూడా మంజూరు చేసింది. అయితే నిర్ణీత సమయంలో సినిమాను విడుదల చేయడంలో ఆయన విఫలమవడంతో, తాజాగా మరో నెల రోజుల గడువు కోరుతూ జూలై 15 వరకు సమయం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై కోర్టు నిర్ణయం వెలువరించనుంది. ఇదే సమయంలో, సినిమా ఫైనాన్షియర్లు కె. ప్రేమ్ కుమార్, కె. పుణ్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్ కూడా విచారణకు రానుంది. తమ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, వాటాల పంపకంపై స్పష్టత లేకపోవడంతో న్యాయం చేయాలని వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో నేటి విచారణ *'ధ్రువ నక్షత్రం'* భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా మారింది. కోర్టు గౌతమ్ మీనన్‌కు మరింత గడువు ఇస్తుందా? లేక ఫైనాన్షియర్ల వాదనలకు అనుకూలంగా తీర్పు వెలువడుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com